RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 5 డిసెంబర్ 2025 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:156

# తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ కట్టి తీరుతాం



## ఎర్ర బస్సు రావడం కష్టమనుకున్న ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తీసుకొస్తున్నాం
## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఆదిలాబాద్ డిసెంబర్ 4 ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం సిఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన-విజయోత్సవ బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ.. "రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ కట్టి తీరుతాం. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయి. ఇక్కడ సిమెంట్ కంపెనీని మళ్లీ ప్రారంభిస్తాం. ఏడాదిలో ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభిస్తాం. ఎర్ర బస్సు రావడం కష్టమనుకున్న ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తీసుకొస్తున్నాం. అత్యంత వెనకబడిన ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటా" అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఎంతమందికైనా ఆర్థిక సాయం అందిస్తాం
## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

వార్తా 3 లో



# రోజురోజుకు క్షీణిస్తున్న రూపాయి మారకం విలువ

## గురువారం మరో 28 పైసలు కోల్పోయి ఆల్‌టైం హైకి 90.43కి పడిపోయిన రూపాయి
## రూపాయి పతనానికి ఆర్బీఐ బ్రేక్ వేసేనా?



**హైదరాబాద్ డిసెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** రూపాయి మారకం విలువ రోజురోజుకు క్షీణిస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్లో యూఎస్ డాలర్‌కు డిమాండ్ నెలకొనడంతో రూపాయి లైఫ్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. ఇప్పటికే 90.15 స్థాయికి పడిపోయిన విలువ గురువారం మరో 28 పైసలు కోల్పోయి ఆల్‌టైం హైకి 90.43కి పడిపోయింది. రూపాయి విలువ పతనం మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం రూ.90.70-91 మార్కును తాకుతుందని పేర్కొన్నారు.కాగా, బుధవారం ఉదయం 89.96 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 90.30 స్థాయికి పతనమైంది. చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 19 పైసలు తగ్గి 90.15కి జారుకున్నది. మంగళవారం రూపాయి విలువ 43 పైసలు కోల్పోయి 89.96కి పడిపోయిన విషయం తెలిసిందే. దిగుమతిదారుల నుంచి అమెరికా కరెన్సీకి డిమాండ్ నెలకొనడం రూపాయి పతనానికి ఆజ్యంపోసిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. ప్రస్తుత సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 5 శాతం పతనం చెందింది.

**రూపాయి పతనానికి ఆర్బీఐ బ్రేక్ వేసేనా?**

అంతర్జాతీయంగా అన్ని కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు గురవుతున్నాయని, ఇదే క్రమంలో రూపాయి పతనం చెందింది తప్పా.. బలహీనమైన కరెన్సీ మాత్రం కాదని ఎస్బీఐ ఎకానమిక్ రీసర్చ్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మరోవైపు, ఈవారంలోనే వడ్డీరేట్ల తగ్గింపుపై రిజర్వు బ్యాంక్ నిర్ణయం తీసుకోనుండటం కూడా రూపాయి పతనానికి బ్రేక్ వేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. స్వల్పకాలంలో డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 89.90 నుంచి 91.20 మధ్యలో నమోదుకానున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.3,206 కోట్ల షేర్లను విక్రయించడం కూడా రూపాయి పతనానికి ఆజ్యంపోసింది. దేశీయ ఎగుమతులు నీరసించడం, వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్ఠంభన నెలకొనడం విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళనన నెలకొన్నది.

**ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం**

రూపాయి పతనంతో దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా దిగుమతులపై అత్యధికంగా ఆధారపడుతున్న భారత్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వారు వెల్లడిస్తున్నారు. చమురు బిల్లుల కోసం అధికంగా వెచ్చించాల్సి రావచ్చునని అంటున్నారు. ముఖ్యంగా దేశీయ వినిమయంలో 80 శాతం దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు ఇది పెద్దదెబ్బేనని వారు అంటున్నారు.

**భారంగా మారిన విదేశాల్లో ఉన్నత విద్య**

రోజురోజుకూ దారుణంగా పడిపోతున్న రూపాయి విలువ కంటికి కనిపించని దెబ్బ కొడుతున్నది. డాలరుతో రూపాయి మారకం విలువ బుధవారం రూ.90 దాటింది. రూపాయి విలువ బలహీనపడుతున్నకొద్దీ దిగుమతి సరుకుల ధరలు భారీగా పెరుగుతుండగా, ఎగుమతి అయ్యే వస్తువులు చౌకగా మారిపోతున్నాయి. ముఖ్యంగా చమురు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. పతనమవుతున్న రూపాయి విలువతో ప్రధానంగా ప్రభావితమవుతున్నవారు విదేశాల్లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు. ఇది వారి కుటుంబాలను కంటికి కనిపించని రీతిలో దెబ్బ కొడుతున్నది. రూపాయి విలువ తగ్గడం కారణంగా అమెరికా, బ్రిటన్, ఇటలీ, జర్మనీ, సింగపూర్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో చదువుతున్న విద్యార్థులు, వారి కుటుంబాలకు ఆర్థిక భారం తడిసి మోపెడవుతున్నది.ఇటు రూపాయి పతనం అటు విద్యార్థుల వార్షిక ఫీజు, వారి జీవనంపై భారం మోపుతున్నది. ఫీజులు లక్షల్లో పెరుగుతున్నాయి. అదే సమయంలో విదేశీ మారకంలో తీసుకున్న విద్యా రుణాలు కూడా పెరిగిపోతున్నాయి. గత ఏడాది భారత్ నుంచి విదేశాలకు చదువుకోవడానికి వెళ్లిన వారి సంఖ్య 7.6 లక్షలు. న్యూయార్క్ యూనివర్సిటీలో చదువుతున్న సంజనా కుమార్ తన అనుభవాన్ని చెప్తూ..'మా తల్లిదండ్రులు నాకు ఖర్చుల కోసం నెలకు 1500 డాలర్లు పంపుతారు. గత ఏడాది డాలర్ విలువ రూ.83.5 ఉన్నప్పుడు నా తల్లిదండ్రులకు రూ.1.25 లక్షలు ఖర్చయ్యేవి. ఇప్పుడు అవే 1500 డాలర్లకు వారికి మరో రూ.10 వేలు ఎక్కువగా ఖర్చవుతున్నాయి' అని వివరించారు.



గోషామహల్ కాంగ్రెస్ పార్టీ
నాయకులు కార్యకర్తలు

ప్రజాబలం

5 డిసెంబర్ 2025 శుక్రవారం

# సంస్కరణలా కార్మికుల హక్కులను కత్తిరించడమా

ప్రతి ఒక్కరూ జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని అనుకుంటారు. కానీ అందరూ అనుకున్న గమ్యాన్ని చేరుకోలేరు. అయితే ఆర్థిక అవసరాలు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఒక్కోసారి చిన్న ఉద్యోగం అయినా చేయాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో ఎక్కడైనా ఉద్యోగ అవసరం ఉంటే వెంటనే అక్కడికి వెళ్లి జాబ్ కోసం అడుగుతూ ఉంటారు. అయితే మొన్నటి వరకు చిన్న ఉద్యోగం చేసే వారికి ఎలాంటి ప్రయోజనాలు లేవు. కానీ కొత్తగా లేబర్ కోడ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత వీరికి అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయి. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ముసాయిదా నిబంధనలు త్వరలోనే ప్రీ-పబ్లిష్ అవుతాయని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ బుధవారం చెప్పారు. వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయడం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభమవుతుందన్నారు.ఒక షాప్ లేదా చిన్న సంస్థలో ఉద్యోగం అంటే కేవలం పనికి తగిన జీతం ఇచ్చేవారు. ఎలాంటి ప్రయోజనాలు ఉండేవి కావు. కనీసం వారు ఉద్యోగం చేస్తున్నట్లు ఎలాంటి గుర్తింపు లేదా ఐడెంటిటీ ఉండేది కాదు. కానీ కొత్తగా వచ్చిన లేబర్ కోడ్ ప్రకారం ఏ సంస్థ అయినా ఉద్యోగిని నియమించుకుంటే ఖచ్చితంగా అపాయింట్మెంట్ లెటర్ ఇవ్వాల్సిందే. అపాయింట్మెంట్ లెటర్ లేకుండా ఎవరినీ నియమించుకోవడానికి ఆస్కారం లేదు. ఈ అపాయింట్మెంట్ లెటర్ ద్వారా ఉద్యోగికి గుర్తింపు ఉండడంతో పాటు ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్ లా ఉపయోగపడుతుంది. అతను ఇక్కడ ఎన్నాళ్లపాటు చేశాడో.. దాని ఆధారంగా మరో ఉద్యోగాన్ని కూడా పొందే అవకాశం ఉంటుంది.అంతేకాకుండా అపాయింట్మెంట్ లెటర్లో ఉద్యోగికి సంబంధించిన ప్రయోజనాలు ఉంటాయి. 20 మంది ఉద్యోగులు ఉన్న చిన్న సంస్థలో ఇప్పటివరకు ఈపీఎఫ్ ఏర్పాటు చేసేవారు. కానీ ఇప్పుడు ప్రతి ఉద్యోగికి ఈపీఎఫ్ ఉండాల్సిందేనని కొత్త లేబర్ కోడ్ తెలుపుతోంది. అలాగే ఆర్గనైజ్డ్, అన్ ఆర్గనైసేడ్ సంస్థల్లో ఉన్న ఉద్యోగికి కనీస వేతనం ఇవ్వాలని తెలిపింది. గతంలో వారు నిర్ణయించుకున్న జీతం మాత్రమే ఇచ్చేవారు. కానీ ఇప్పుడు లేబర్ కోడ్ యాక్ట్ ప్రకారం గా జీతం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ జీవితంలో ఎక్కువ భాగం పిఎఫ్, గ్రాట్యుటీ కి వెళ్తుంది. దీర్ఘకాలంలో ఇది ఉద్యోగులకు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది.మొన్నటివరకు గిగ్ వర్కర్లు, ఫ్రీలాన్స్ సర్వీస్ చేసే వారికి ఎలాంటి ప్రయోజనాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు వీరికి సైతం సామాజిక భద్రతను కలిగిస్తున్నాయి. వీరికి లైఫ్ ఇన్సూరెన్స్, డిజేబులిటీ కవర్, హెల్త్ సపోర్ట్ వంటి ప్రయోజనాలు ఉండనున్నాయి. గతంలో గ్రాట్యుటీ రావాలంటే కనీసం ఐదు సంవత్సరాల పాటు ఒక సంస్థలో పనిచేయాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ఒక ఏడాది పని చేసినా కూడా గ్రాట్యుటీ లభిస్తుంది. ఇది ఉద్యోగి సంస్థ నుంచి వెళ్ళిపోయే సమయంలో ఆర్థిక అవసరాలను తీరుస్తుంది. అలాగే ఓవర్ టైం పనిచేసే వారికి అదనంగా ఆదాయం ఇవ్వాలని కూడా కొత్త లేబర్ కోడ్ తెలుపుతోంది. ఈ రకంగా అదనంగా పనిచేసిన వారి కి ప్రయోజనాలు కలగనున్నాయి.దశాబ్దాలుగా అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా దేశంలో అత్యంత ప్రభావవంతమైన ఆర్థిక సంస్కరణలను అమలు చేయనున్నట్లు భారత ప్రభుత్వం గతవారం ప్రకటించింది.దీని కారణంగా, కార్మిక నిబంధనల సంఖ్య 1,400 నుంచి దాదాపు 350కి తగ్గింది. కంపెనీలు పూరించాల్సిన ఫారమ్‌ల సంఖ్య 180 నుంచి 73కి తగ్గింది. దీంతో, వాణిజ్య నియంత్రణ భారం చాలావరకు తగ్గుతుంది.ఈ చట్టాలను 2020లోనే పార్లమెంట్ ఆమోదించింది. కానీ, ఐదేళ్ల జాప్యం, రాజకీయ చర్చల తర్వాత, ఇప్పుడు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి.పాత కార్మిక నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయని, తయారీ రంగ మందగమనానికి అవే కారణమని నిందించిన కంపెనీలు.. ఈ సంస్కరణలను స్వాగతించాయి. ముఖ్యంగా ట్రంప్ 50 శాతం సుంకాల నేపథ్యంలో ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయాలనే ప్రభుత్వ ధోరణిలో ఇది భాగం. దేశంలో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి, మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడానికి, జీవీసీ (గ్లోబల్ వాల్యూ చైన్)లో విలీనం కావడానికి భారత్ ఆసక్తిగా ఉందనేదానికి ఇదో ముఖ్యమైన సంకేతమని బ్రోకింగ్ హౌస్ నోమురా అభిప్రాయపడింది.మరోవైపు, కార్మిక సంఘాలు వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ కోడ్‌లను “స్వాతంత్ర్యం తర్వాత కార్మికులు కష్టపడి సాధించుకున్న హక్కులను కాలరాసే దుందుడుకు చర్య”గా అభివర్ణిస్తున్నాయి.కార్మిక చట్టాలలో మార్పులు దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీశాయి. బుధవారం దిల్లీలో వామపక్ష ట్రేడ్ యూనియన్ల నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలో సుమారు 200?300 మంది పాల్గొన్నారు. కొత్త చట్టాలు కార్మికులకు కాదు, యజమానులకే ఉపయోగకరమని 33 ఏళ్ల ఫ్యాక్టరీ కార్మికుడు ఆకాశ్‌దీప్ సింగ్ అన్నారు.నిరసనలో పాల్గొన్న చాలామంది ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్కరణలు.. కాలం చెల్లిన కార్మిక చట్టాల ఆధునీకరణకు, నిబంధనల అమలును సరళతరం చేసేందుకు, కార్మికుల హక్కుల సంరక్షణకు ఉద్దేశించినవని ప్రభుత్వం చెబుతోంది. కొత్త చట్టాలు దేశంలో పెరుగుతున్న గిగ్ వర్క్‌ఫోర్స్‌కు మొదటిసారిగా చట్టపరమైన గుర్తింపును ఇస్తాయని అంటోంది.కార్మికులకు అనుకూలమైన పలు అంశాలు: కంపెనీలు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వడం, అందరికీ ఒకేరకమైన కనీస వేతనాలు, 40 ఏళ్లు పైబడిన కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య పరీక్షలు, లింగ భేదం లేకుండా వేతనం వంటివి స్వాగతించదగినవి.నిబంధనల అమలు భారం తగ్గడం, మెరుగైన సామాజిక భద్రత, గిగ్ వర్కర్లనూ చేరుస్తూ “ఉద్యోగి” నిర్వచనాన్ని విస్తరించడం వంటి సంస్కరణలు దేశంలో విస్తృతమైన అసంఘటిత ఆర్థిక వ్యవస్థను సంఘటిత వ్యవస్థలోకి తెచ్చేందుకు సాయపడతాయని నిపుణులు అంటున్నారు.కొత్త కోడ్‌లు పాత చట్టాలలోని అనేక అసమానతలను పరిష్కరిస్తాయని నీతి ఆయోగ్ మాజీ చైర్మన్, ఆర్థికవేత్త అరవింద్ పనగారియా అభిప్రాయపడ్డారు.”భారత కార్మిక చట్టాలను 100 శాతం అమలు చేయలేరు, వాటిలో 20 శాతం ఉల్లంఘించక తప్పని పరిస్థితులు ఉన్నాయన్నారు.కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులు ఇప్పటికే లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయని, చాలామంది కార్మికులు తమ ఫిర్యాదులను నమోదు కూడా చేసుకోలేకపోతున్నారని ఆయన అన్నారు.కార్మికులు ఇప్పుడు సమ్మెకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి – ఈ నిబంధన గతంలో ప్రభుత్వ రంగ సంస్థలకు మాత్రమే వర్తించేది. ఇది సమష్టిగా బేరసారాలు చేసే కార్మికుల అధికారాన్ని దూరం చేస్తుందని దత్తా అభిప్రాయపడ్డారు.దేశంలోని శ్రామిక-వయస్సు జనాభాలో సగానికి పైగా శ్రామిక శక్తిలో లేరు. దాదాపు 60 శాతం మంది కార్మికులు స్వయం ఉపాధి పొందుతున్నారు. పాత చట్టాలు విఫలమయ్యాయనే విషయాన్ని ఇది స్పష్టంగా చూపుతోందని నిపుణులు అంటున్నారు.తయారీ, పెట్టుబడిపై కొత్త నిబంధనల ప్రభావం ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. కానీ స్వల్పకాలంలో, కంపెనీలు అనేక సవాళ్లను ఎదుర్కోవచ్చు.”వేతనాలు, హెచ్‌ఆర్ వ్యవస్థ, సామాజిక భద్రత, నిబంధనలు అమలు వంటి విషయాల్లో సంస్థలు మార్పులకు సిద్ధం కావాలి” అని స్టాఫింగ్ ఏజెన్సీ బీడీఓ ఇండియా తెలిపింది.కార్మిక వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర చట్టాలు రెండూ నియంత్రిస్తుండటంతో, కంపెనీలు కొంతకాలం రెండు సెట్ల నియమాలను పాటించాల్సి రావొచ్చని బీడీఓ ఇండియా అభిప్రాయపడింది.యూనియన్ల నుంచి కొనసాగుతున్న నిరసనలను కూడా ప్రభుత్వం ఎదుర్కోవలసి ఉంటుందని అంచనా వేసింది.

# పోలింగ్ ప్రక్రియలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని





డిసెంబర్ 24, 2025: రాష్ట్రంలోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు 3 విడతలుగా జరగనున్న పోలింగ్ ప్రక్రియలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు.గురువారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల కమిషన్ సభ్యులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు,జిల్లా పంచాయతీ అధికారులతో పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్ధవంతంగా అమలు చేయాలని, సర్పంచ్,వార్డు సభ్యుల స్థానాల చివరి విడత నామినేషన్ల ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.3వ విడతలో నిర్వహించే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిబంధన 15 ప్రకారం ఎన్నికల ప్రకటన,ఫారాలు జారీ చేయాలని, ఉప సర్పంచ్ ఎన్నిక పరోక్షంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, ఫారం 14,20 వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియలో నెలకొన్న సమస్యలు, అందిన ఫిర్యాదుల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. నివేదికలు,టి-పోల్ ఎంట్రీలు,రికార్డులు, మిస్ మ్యాచ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... జిల్లాలో 306 గ్రామ పంచాయతీలు,2 వేల 680 వార్డు సభ్యుల స్థానాలకు 3 విడతలలో ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని, అధికారులకు, సిబ్బందికి తగు శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు.జిల్లాలో 6 మంది సర్పంచ్ లు, 268 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని,టి-పోల్ ఎంట్రీ,లు పూర్తిగా మ్యాచ్ అయ్యాయని తెలిపారు.72 వెబ్ కాస్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 26 సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరిగిందని,పోస్టల్ బ్యాలెట్ సంబంధిత హ్యాండ్లింగ్ పంచాయతీ కార్యదర్శి పరిధిలో ఉంటుందని తెలిపారు. బ్యాలెట్ పాకింగ్ ప్యాకింగ్, నిర్వహణ బాధ్యతలు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కేటాయించడం జరిగిందని తెలిపారు. అధికారుల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని,స్టేజ్ 2 ఆర్. ఓ.ల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.సర్పంచ్ స్థానాల ఎన్నిక మొదటి విడతలో 6 స్థానాలు ఏకగ్రీవం కాగా 3 స్థానాలలో నామినేషన్లు రాలేదని, 81 స్థానాలలో పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎన్నికల అధికారి,పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి గణపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణం: కేటీఆర్




**హైదరాబాద్ డిసెంబర్ 4 (ప్రజాబలం ప్రతినిధి:** హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు.హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు.రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శనమన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు

# క్వాంటం సిటీ”గా హైదరాబాద్

## దేశంలోనే తొలిసారిగా “లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ” స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ప్రత్యేకంగా “ఫండ్స్ ఆఫ్ ఫండ్స్” రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

“క్వాంటం సిటీ”గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. “క్వాంటం టెక్నాలజీ”లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా “లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ”ని రూపొందించామన్నారు. గచ్చిబౌలిలోని “ఐఐఐటీ హైదరాబాద్”లో “నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం %ం% తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ”ని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. “లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ”లో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్వాంటం సెన్సింగ్, సెక్యూరిటీ, కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్ లో ఆర్‌అండ్‌డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశం చేసే “డైరెక్షన్” అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా “సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్”కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా “ఫండ్స్ ఆఫ్ ఫండ్స్”ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. “ఇండస్ట్రీ డే” పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధి కారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గా లు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, మెంబర్ డా. వీకే సారస్వత్, దేబ్ జానీ ఘోష్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఎంతమందికైనా ఆర్థిక సాయం అందిస్తాం

**సీనియర్ అధికారులతో ఇంటర్వ్యూ బోర్డును ఏర్పాటు చేస్తాం**
**సమాజం పట్ల బాధ్యతగా ఉండాలి**
**మెయిన్స్ కు ఎంపికైన 50 మందికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సివిల్ సర్వీసెస్ మెయిన్స్, ఇంటర్వ్యూ లకు ఎంతమంది ఎంపికైనా ఆర్థిక సహాయం అందిస్తాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన ప్రజా భవన్ లో యూపీఎస్సీ ఇంటర్వ్యూకు ఎంపికైన 50 మందికి చెక్కులు అందించిన అనంతరం ప్రసంగించారు. సివిల్ సర్వీసుల్లో విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని తపిస్తున్న అందరికీ అభినందనలని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రం నుంచి ఎంత మంది ఎక్కువ ఎంపిక అయితే రాష్ట్రానికి అంత మంచిదని భావించి ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అపారమైన మేధస్సు ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఎంపిక కాలేకపోతున్నారన్న సమాచారం తెలుసుకొని ఆ ఇబ్బందులు తీర్చేందుకు సింగరేణి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని తీసుకువచ్చామని డిప్యూటీ సీఎం వివరించారు. మెయిన్స్ కు ఎంపికైన వారికి లక్ష రూపాయలు ఆ తర్వాత ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఢిల్లీలో వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు వివరించారు. ఔత్సాహికులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తే పుస్తకాలు, ప్రయాణం, కోచింగ్ వంటి అవసరాలకు ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావించి ఈ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. మొదటిసారి 140 మంది మెయిన్స్ కు ఎంపిక కాగా అందులో 20 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని వివరించారు. వారికి రెండు దశల్లోనూ లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించామని అన్నారు. గత సంవత్సరం 20 మంది ఇంటర్వ్యూ కు వెళ్లగా అందులో ఏడుగురు సివిల్ సర్వీసెస్ కు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ఏడుగురికి సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ శుభాకాంక్షలు తెలియజేస్తుందని అన్నారు.

గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువమంది సుమారు 202 మంది మెయిన్స్ కు ఎంపిక కాగా అందులో 50 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని తెలిపారు. గత సంవత్సరం 20 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కాగా ఈసారి 50 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం అభినందనీయమని వచ్చేసారి ఈ సంఖ్య 100కు దాటి వెళ్లాలని అన్నారు.

మెయిన్స్ కు ఎంపికైన 50 మందికి రొటీన్ గా చెక్కులు అందజేయవచ్చు కానీ వారి అభిప్రాయాలు తెలుసుకొని భవిష్యత్తులో మరింతగా ఈ పథకాన్ని తీర్చిదిద్దేందుకు వారి అభిప్రాయాలు తెలుసుకోవాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇంటరాక్షన్ కార్యక్రమం ఏర్పాటు చేశాం దీని ద్వారా ఎంతో మందికి ఇన్స్పిరేషన్ ఉంటుందని డిప్యూటీ సీఎం వివరించారు.

ఇంటర్వ్యూకు వెళ్లే 50 మంది విజయం సాధించాలని వారు రాష్ట్రానికి ఎంపిక అయితే మంచిది, లేదంటే దేశంలో ఏ రాష్ట్రంలో సేవలు అందించిన వారు వారి తల్లిదండ్రులతో పాటు రాష్ట్రం పైన ప్రేమ చూపే అవకాశం ఉంటుందని వారి ఆలోచనలు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడతాయని భావిస్తున్నట్టు తెలిపారు.

కోట్లాది మంది ప్రజలు చెల్లించిన పన్నుల నుంచి మీకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది



మీరు స్థిరపడిన తర్వాత మిమ్ములను పెంచి పోషించిన తల్లిదండ్రుల పట్ల ఎంత బాధ్యతగా ఉంటారో సమాజం పట్ల అంతే బాధ్యతగా ఉండాలని డిప్యూటీ సీఎం కోరారు. సివిల్ సర్వీసెస్ కు ఎంపికైన తర్వాత ఆఫీసులకు వెళ్లే ప్రతిరోజు మీ సంతకం లక్షలాది మంది జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న ఆలోచనతో పనిచేయాలని డిప్యూటీ సీఎం కోరారు. మెయిన్స్ కు ఎంపికైన అభ్యర్థులు త్వరితగతిన కోచింగ్ సెంటర్లకు వెళ్లి మంచి శిక్షణ తీసుకోవాలని సమయం తక్కువగా ఉన్నందున అశ్రద్ధ చేయవద్దని తెలిపారు. ఇంటర్వ్యూ కు వెళ్లే సమయంలో ఢిల్లీలో ఎలాంటి ఇబ్బంది ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పక్షాన సహాయం అందించేందుకు అక్కడ ప్రత్యేక ప్రతినిధులు ఉంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలోని సీనియర్ బ్యూరోక్రాట్లతో ఇంటర్వ్యూ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు ఈ మేరకు చీఫ్ సెక్రటరీతో తాను చర్చించినట్టు వివరించారు. ఇంటర్వ్యూ కు వెళ్లే అభ్యర్థులు విజయం సాధించాలని రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేయాలని తనకు చెప్పారని డిప్యూటీ సీఎం వివరించారు. ఇంటర్వ్యూ కు వెళ్లే అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం యావత్తు మద్దతుగా ఉంటుందని విజయం సాధించి రావాలని కోరారు.

సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్ర మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని అభినందనలు తెలియజేశారు.

ముందుగా సంస్థ సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ పేద వర్గాల నుంచి కూడా అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో విజేతలుగా నిలవాలి అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. మొదటి ఏడాది మంచి స్పందన లభించిందని, రెండో ఏడాది రెట్టింపు స్పందనతో పాటు ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు ఫైనల్స్ కు ఎంపికవడం అభినందనీయమన్నారు.

ప్రిలిమ్స్ లో పాస్ అయిన వారితో పాటు ఫైనల్‌కు ఎంపికైన వారికి కూడా లక్ష రూపాయల చొప్పున ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించడంతో అభ్యర్థులు ఇతర సమస్యలపై దృష్టి మరల్చకుండా ఏకాగ్రతతో పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం ఏర్పడిందని, ఈసారి 50 మంది అభ్యర్థులు ఫైనల్ ఇంటర్వ్యూ లకు ఎంపిక అవడం దీనికి ఒక





ఉదాహరణ అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయనతో పాటు సంస్థ డైరెక్టర్ పర్సనల్ శ్రీ గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ శ్రీ బి వెంకన్న ఫైనల్ ఇంటర్వ్యూలకు ఏ విధంగా సంసిద్ధం కావాలి అనే అంశం పైన చక్కని సూచనలు చేశారు. అభ్యర్థుల సందేహాలను కూడా నివృత్తి చేశారు.

ఇదే కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా రూపొందించిన సింగరేణి బ్రాండ్ శాలువాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు ఆవిష్కరించారు. అలాగే సింగరేణి జ్ఞాపికను ఆయన ఆవిష్కరించారు. ఇకపై సింగరేణి అధికారిక కార్యక్రమాల్లో వీటిని ఉపయోగిస్తామని, తెలంగాణ రైజింగ్ కార్యక్రమాల సందర్భంగా సింగరేణి అభివృద్ధి, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించాలన్న ఉద్దేశంతోనే వీటిని రూపొందించినట్లు సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ మరియు మార్కెటింగ్ శ్రీ తాడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని నిలోఫర్ ఆసుపత్రి లో పరామర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**అత్యవసర సాయం కింద లక్ష రూపాయల చెక్కు అందజేత**
**బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం**
**బాలుడికి పెన్షన్, స్పెషల్ పాఠశాలలో అడ్మిషన్.**
**బాలుడు తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వం పరంగా అన్ని సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చిన మంత్రి అడ్లూరి**



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ ఎల్బీనగర్ మన్సురాబాద్ సమీపంలోని శివగంగా కాలనీలో ప్రేమ్ చంద్ అనే ఒక బాలుడిపై కుక్కల కరిచిన ఘటనపై

ఎస్సీ ఎస్టీ దివ్యంగుల సంక్షేమ శాఖ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్న ఈ ఘటనపై వార్త కథనాలకు స్పందించి వెంటనే సీఎం గారు ..తనకు కు ఫోన్ చేసి సత్వరమే..ప్రేమ్ చంద్ కు తగిన వైద్య సదుపాయం, ఆర్థిక సహాయంతో పాటు కుటుంబానికి అండగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ మేరకు బుధవారం.. నీలోఫర్ ఆస్పత్రికి వెళ్ళి చికిత్స పొందుతున్న బాలుడిని మంత్రి అడ్లూరి స్వయంగా కలిసి పరామర్శించారు.

ప్రేమ చంద్

తల్లి దండ్రులు. ....%జ% తిరుపతి రావు , చంద్రకళ దంపతులకు మంత్రి ఒక లక్ష రూపాయల చెక్కును అందించారు.

ఈ సందర్భంగా మీడియాతో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ..



బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరి చేస్తామని మంత్రి తెలిపారు.

బాలుడికి స్పెషల్ స్కూల్ లో అడ్మిషన్ కూడా ఇప్పించి చదువును కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు.

ఈ హృదయ విదారక ఘటన తనను ఎంతో కలిచి వేసిందన్నారు.

ఈ ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే సంబంధిత అధికారుల బృందం నిలోఫర్ ఆసుపత్రి చేరుకొని చికిత్స పొందుతున్న బాలుడి తల్లిదండ్రులను కలసి వివరాలు సేకరించినట్లు మంత్రి చెప్పారు.

బాధిత బాలుడి తండ్రి వినతిని పరిగణలోకి తీసుకొని, బాలుడి సంపూర్ణ వైద్య సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం దగ్గరుండి చేసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

బాలుడికి అవసరమైన సహాయక చర్యలన్నీ ప్రభుత్వం నుంచి అందిస్తున్నామని ఆయన తెలిపారు.

మంత్రి అడ్లూరి ఆదేశాల మేరకు బాలుడికి సంబంధిత శాఖ అధికారులు ఆ బాలుడికి దివ్యాంగుల గుర్తింపు కార్డు తక్షణమే జారీ చేయడం జరిగింది.

అలాగే అర్హత ప్రకారం దివ్యాంగ పింఛను మంజూరు చేయటం

అలాగే కోలుకున్న తర్వాత బాలుడికి కావలసిన సంరక్షణ కు కావలసిన సదుపాయాలు పూర్తిగా కల్పించడం దీంతో పాటు వైద్య చికిత్స, పునరావాస సహాయ అందించడం కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

ఇక ముందు ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో ఎప్పుడు , ఎక్కడ, చోటు చేసుకున్న జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారులు ఆలస్యం చేయకుండా బాధిత కుటుంబాలను సందర్శించి, అవసరమైన సేవలు, సహాయం వెంటనే అందించాలని కూడా మంత్రి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో దివ్యాంగుల శాఖ కమిషనర్





అనిత రామచంద్రన్, డైరెక్టర్ శైలజ , నిలోఫర్ ఆసుపత్రి

%ూబజూవతీఱఅనవత్‌వత్% విజయ్ కుమార్ , ,ఆర్ ఎం ఓ డా ఆనంద్ , లాలూ ప్రసాద్, బాబురావు ..ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నక్ష పథకానికి రూ.125 కోట్లు

విజయవాడ, డిసెంబర్ 4, ఏపీకి కేంద్రం మరో శుభవార్త వినిపించింది. నక్ష కార్యక్రమం కింద రాష్ట్రానికి నిధులు మంజూరు చేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. నక్ష కార్యక్రమం అమలులో చూపిన ప్రగతికి గానూ.. రూ.125 కోట్లు కేటాయించినట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. మరోవైపు నక్ష కార్యక్రమం కింద పట్టణాలు, నగరాల్లో పబ్లిక్, ప్రైవేట్ ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు మంజూరు చేస్తారు. ఏపీలోని పది ప్రాంతాల్లో ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం మరో శుభవార్త అందించింది. ఏపీకి రూ. 125 కోట్లు మంజూరు చేసింది. నక్షా కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం రూ.125 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. నక్ష, శాసి కార్యక్రమాల కింద పట్టణ భూసమీకరణ వ్యవస్థ ఆధునీకరణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చూపిన ప్రగతిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ రూ.125 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పది పట్టణ స్థానిక సంస్థల్లో చూపిన పురోగతిని గుర్తించి ఈ నిధులు మంజూరు చేసినట్లు.. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు.మరోవైపు నక్ష కార్యక్రమం కింద ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు జారీచేస్తారు. ఈ కార్యక్రమం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పది మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లను కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది.ఈ ప్రాంతాల్లో 2026 మార్చి ఆఖరి నాటికి ప్రాజెక్టు పూర్తిచేసి పబ్లిక్, ప్రైవేట్ ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు జారీ చేస్తారు. అనంతరం రెండో విడతలో రాష్ట్రంలోని మరికొన్ని పట్టణాలకు ఈ ప్రాజెక్టును విస్తరిస్తారు. మరోవైపు పైలెట్ ప్రాజెక్టు కోసం ఏపీలోని అనంతపురం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కాకినాడ, ఏలూరు, కర్నూలు, తిరుపతి, మంగళగిరి-తాడేపల్లి, కుప్పం మున్సిపాలిటీని ఎంపిక చేశారు.భారత ప్రభుత్వం నగరాలు, పట్టణాల్లో భూ రికార్డులను ఆధునీకరించడానికి, రికార్డులను సమగ్రపరచడానికి ప్రారంభించిన పైలట్ కార్యక్రమం. పట్టణ ప్రణాళికను మెరుగుపరచడంతో పాటుగా.. వివాదాలను తగ్గించేందుకు, ఖచ్చితమైన, నవీనమైన, ఉమో-ఇంటిగ్రేటెడ్ డేటాబేస్‌లను సృష్టించడం ఈ కార్యక్రమం లక్ష్యం. అలాగే భూమి సంబంధిత వివాదాలు, మోసాలను తగ్గించడానికి ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చారు.మరింత ఖచ్చితమైన రికార్డుల ద్వారా మున్సిపల్ ఆదాయ సేకరణను మెరుగుపరచడంలో సహాయపడటం కూడా ఓ ఉద్దేశం. 27 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలలోని పట్టణ ప్రాంతాలలో పైలెట్ ప్రాజెక్టుగా దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సర్వే ఆఫ్ ఇండియా, ఔఎఊఎ, ఇతర సంస్థల సాంకేతిక సహకారం అందిస్తున్నాయి.

# మచిలీపట్నం, రేపల్లె రైల్వే పనులు షురూ

గుంటూరు, డిసెంబర్ 4, లైంది. దివిసీమ, అవనిగడ్డ ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. అంతేకాదు, మచిలీపట్నం-నర్సాపురం, రేపల్లె-బాపట్ల మధ్య కొత్త లైన్లు, గూడూరు-విజయవాడ మధ్య నాలుగో లైన్, విజయవాడ బైపాస్ లైన్ల పనులు కూడా రానున్నాయి. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తోంది. రైల్వే లైన్లకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం తీపికబురు చెప్పింది.. కొత్త రైల్వే లైన్లపై రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. మచిలీపట్నం-రేపల్లె మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ (వివరాల ప్రాజెక్ట్ నివేదిక) తయారీ కోసం క్షేత్రస్థాయి సర్వే ప్రారంభమైందని తెలిపారు. లోక్‌సభలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఈ కొత్త రైల్వే లైన్ నిర్మాణం ఎప్పటిలోగా పూర్తవుతుంది, 2026-27 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టును చేరుస్తారా లేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం డీపీఆర్ సిద్ధమవుతోందని.. దివిసీమ, అవనిగడ్డ ప్రజల చిరకాల డిమాండ్ అయిన ఈ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు .ఏపీలోరేపల్లె-మచిలీపట్నం రైల్వే లైన్ కీలకమైన ప్రాజెక్ట్ అని.. దీనికి ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. డీపీఆర్ తయారీతో పాటు, మచిలీపట్నం-నర్సాపురం మధ్య 74 కిలోమీటర్లు, రేపల్లె-బాపట్ల మధ్య 46 కిలోమీటర్ల కొత్త లైన్ల నిర్మాణం చేపడతామన్నారు. గూడూరు-విజయవాడ మధ్య 293 కిలోమీటర్ల నాలుగో లైన్, 49 కిలోమీటర్ల పొడవైన విజయవాడ బైపాస్ లైన్ (ఇందుపల్లి-దుగ్గిరాల)ల డీపీఆర్‌ల తయారీకి అవసరమైన సర్వే చేపట్టడానికి అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.విజయవాడ-తెనాలి మధ్య మూడవ రైల్వే లైన్ నిర్మాణం వేగంగా జరుగుతోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ - గుంటూరు జిల్లా దుగ్గిరాల మధ్య కొత్త రైల్వే లైన్నిర్మాణం కోసం ప్రస్తుతం సర్వే పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. కృష్ణా జిల్లా గుడివాడ, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, నర్సాపురం మధ్య అదనపు రైల్వే లైన్ల కోసం (డబ్లింగ్) పనులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 2014కు ముందు రైల్వే బడ్జెట్ కేవలం రూ.886 కోట్లు మాత్రమే ఉండేదని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ఏకంగా రూ.9,417 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించామన్నారు.2009 నుంచి 2014 మధ్యకాలంలో కేవలం 363 కిలోమీటర్ల ట్రాక్‌లు మాత్రమే కొత్తగా అందుబాటులోకి వచ్చాయన్నారు కేంద్రమంత్రి. అయితే, 2014 నుంచి 2025 మధ్యకాలంలో 1,582 కిలోమీటర్ల ట్రాక్‌లు ప్రారంభమయ్యాయన్నారు. 'ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి రాష్ట్రంలో ప్రస్తుతం 12 కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, 27 లైన్ల డబ్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ కలిపి 4,498 కిలోమీటర్ల పొడవు ఉంటాయి. వీటి కోసం ప్రభుత్వం రూ.70,231 కోట్లు ఖర్చు చేస్తోంది. రైల్వే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. గత నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో (పూర్తిగా లేదా పాక్షికంగా) 15 కొత్త రైల్వే లైన్లు, 49 లైన్ల డబ్లింగ్ పనుల కోసం 64 సర్వేలు చేపట్టారు. ఈ సర్వేలు పూర్తయితే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి మార్గం సుగమం అవుతుంది. ఈ పనులన్నీ కలిపి మొత్తం 6,967 కిలోమీటర్ల పొడవు ఉంటాయి' అని కేంద్రమంత్రి తెలిపారు.

# ఆశా కిరణమేనా...
# విశాఖ నుంచి వర్క్

విజయవాడ, డిసెంబర్ 4, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ ఎంట్రీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రంగా ఆశయ సాధనకు కృషి చేస్తానని.. ఇకపై ప్రజలతోనే తన ప్రయాణమని ఆమె ప్రకటించడంతో అంచనాలు ఏర్పడ్డాయి. రాజకీయాల్లోకి వస్తారా లేదా అనేదానిపై తాజాగా ఆశా కిరణ్ స్పష్టతనిచ్చారు. వచ్చే మూడేళ్ల పాటు తన సేవా కార్యక్రమాలు, పనితీరును అందరూ చూస్తారని.. ఆ తర్వాత రాధా రంగ మిత్ర మండలి పెద్దల సూచలన మేరకు రాజకీయ నిర్ణయం ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికైతే జకీయాల్లోకి రావడం లేదని, ఏ పార్టీలో చేరడం లేదన్నారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లోకి మరో వారసురాలు ఎంట్రీ ఇచ్చేందుకు రంగం సిద్ధం అయింది. ఇటీవల వంగవీటి రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన తర్వాత.. ఆయన కుమార్తె ఆశా కిరణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇకపై తాను రంగా ఆశయ సాధన కోసం కృషి చేస్తానన్నారు. గత కొంత కాలంగా ప్రజా జీవితానికి దూరంగా ఉన్నానని.. ఇకపై తన పూర్తి ప్రయాణం ప్రజలతోనే ఆశా కిరణ్ చెప్పారు. ఇకపై విజయవాడ ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దీంతో ఆమె రాజకీయాల్లోకి వస్తారని జోరుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో తన పొలిటికల్ ఎంట్రీపై ఆశా కిరణ్ క్లారిటీ ఇచ్చారు.వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా రంగనాడు' పేరుతో డిసెంబరు 26న విశాఖపట్నంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో రాధా రంగ రాయల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగనాడు పోస్టర్‌ను రంగ ఆశా కిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆశా కిరణ్.. రాధా రంగ మిత్ర మండలి సభ్యులను చూస్తే ఒక కుటుంబాన్ని చూసినట్లుగా అనిపిస్తోందన్నారు. రంగనాడు.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా జరిగుతోందన్నారు. ఇది రంగా అభిమానులు కోసం నిర్వహించే సభ అని.. అన్ని పార్టీల్లో ఉన్న రంగా అభిమానులు రావాలని పిలుపునిచ్చారు. చేయి చేయి కలుపు చేజారదు అంటూ తన తండ్రి రంగా చెప్పేవారని.. ఇప్పుడు అదే నినాదంతో రాధారంగ మిత్ర మండలిని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేస్తామని ఆశా కిరణ్ అన్నారుఈ సందర్భంగా తన పొలిటికల్ ఎంట్రీపై వంగవీటి ఆశా కిరణ్ క్లారిటీ ఇచ్చారు. రాజకీయ అరంగేట్రంపై ఇప్పటివరకు ఎలా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఇక్కడికి రాధారంగ మిత్ర మండలి తరఫున పనిచేయడానికి మాత్రమే వచ్చానన్నారు. తనకు ఇప్పుడు ఏ పార్టీతో సంబంధం లేదని, చారిటీ కింద రాధారంగ మిత్ర మండలి పని చేస్తుందని తెలిపారు. తన రాజకీయ నిర్ణయం ఏమైనా ఉంటే తర్వాత చెబుతానన్నారు. అందుకే ఎటువంటి రాజకీయ ప్రకటన చేయడం లేదని.. ఏ పార్టీ లో చేరడం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి ప్రజలకు తన వంతుగా సేవ చేస్తానని, రాధా రంగ మిత్ర మండలి కార్యక్రమం విస్తృతం చేస్తామని చెప్పారు. వచ్చే మూడేళ్లు తన పని తీరు, సేవా కార్యక్రమాలను అందరూ చూస్తారని.. ఆ తర్వాత రాధారంగ మిత్ర మండలి పెద్దల ఆదేశాలు, సూచనల ప్రకారం తన రాజకీయ నిర్ణయం ఉంటుందని క్లారిటీ ఇచ్చారు.తన సోదరుడు వంగవీటి రాధాకృష్ణతో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఆశా కిరణ్ తెలిపారు. అనవసరంగా తప్పుడు వార్తలు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. విశాఖలో జరిగే సభకు వంగవీటి రాధాకృష్ణను కూడా ఆహ్వానించారని చెప్పారు.

# ఆ మూడు లెక్కేంటీ...

గుంటూరు, డిసెంబర్ 4, అమరావతి పరిధిలోని పలు గ్రామాలు మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోకి వచ్చాయి. ఇకపై ఈ గ్రామాల్లో భవన నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనులకు కమిషనర్ ఆమోదం తప్పనిసరి. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుతో పనులు వేగవంతం అవుతాయని, ప్రజలకు మేలు జరుగుతుందని అధికారులు తెలిపారు. అమృత్ 2.0 కింద తాగునీటి సరఫరా, మురుగునీటి కాలువల ఆధునికీకరణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాలు మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ కిందకు వెళ్లిపోయాయి. ఇకపై ఈ గ్రామాల్లోని ప్రజలు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనులకు సంబంధించి అనుమతులు తీసుకోవాలి. ఈ మేరకు అధికారాలను కమిషనర్‌కు బదలాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి పరిధిలోని పెనుమాక, నవులూరు, నిడమర్రు, ఉండవల్లి గ్రామాలు మినహా అన్ని గ్రామాలు పరిధిలోకి వచ్చాయి. సీఆర్‌డీఏ కార్యనిర్వాహక కమిటీ ఈ ప్రతిపాదనను ఆమోదించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.ఇంతకుముందు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పలు అనుమతులకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆమోదం తప్పనిసరిగా ఉండేది. ఇప్పుడు ఆ అధికారాలన్నీ కమిషనర్‌కే సంక్రమించాయి. ఈ మార్పుతో భవన నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనుల ప్రక్రియ వేగవంతం అవుతుందని భావిస్తున్నారు. ఈ అధికారాల బదలాయింపుతో స్థానిక ప్రజలకు, వ్యాపారవేత్తలకు మేలు జరుగుతుందని అధికారులు తెలిపారు. ఇకపై కమిషనరే అన్ని అనుమతులను మంజూరు చేస్తారు. ఇది అమరావతి అభివృద్ధిలో ఒక ముఖ్యమైన ముందడుగు అని చెప్పవచ్చు.ఇకపై అమరావతి పరిధిలోని గ్రామాల ప్రజలు.. భవన నిర్మాణాలు, లే అవుట్లకు అనుమతుల్ని ఓఓఅ నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. వీటితో పాటుగా సఆమోదిత లేఔట్లలో ప్లాట్ల విభజన, టీడీఆర్ బాండ్లతో అదనపు అంతస్తుల ఏర్పాటు, క్వారీలకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌వోసీ) జారీ, సినిమా థియేటర్లకు ఎన్‌వోసీ జారీ, పెట్రోల్ బంకులు, ఫిల్లింగ్ స్టేషన్లకు ఎన్‌వోసీతో పాటుగా మిగిలిన మినహాయింపుల కోసం వచ్చిన దరఖాస్తులు కమిషనర్‌కు పంపాల్సిందే' అంటున్నారు.మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌కు సంబంధించి అమృత్ 2.0 పనులు త్వరలోనే ఊపందుకోనున్నాయి. ప్రభుత్వం ఈ పనులకు సంబంధించి తాజాగా మరోసారి టెండర్లు పిలుస్తోంది. బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో బిడ్లు మొదలయ్యాయి.. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని 86 పనులు చేపట్టనున్నారు. అమృత్ 2.0 కింద పట్టణాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థలను మెరుగుపరుస్తారు. అలాగే మురుగునీటి కాలువల ఆధునికీకరణ, పచ్చదనం పెంపు వంటి అంశాలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఈ పనులు పట్టించుకోలదేనే విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం జూన్‌లో పాత ధరలతో టెండర్లు పిలిచింది.. దీంతో కాంట్రాక్టర్‌లు ఆసక్తిగా లేరు. ఈ క్రమంలో రివైజ్డ్ ధరలతో మరోసారి టెండర్లు పిలుస్తున్నారు.ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో రూ.1,038 కోట్ల విలువైన 86 అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఈ పనుల్లో నీటి సరఫరా, సీవేజ్ మేనేజ్‌మెంట్, పార్కుల అభివృద్ధి వంటివి ఉన్నాయి. పన్నులు, జీఎస్టీ, సీనరేజి ఛార్జీలతో కలిపి మొత్తం వ్యయం రూ.1,595 కోట్లుగా అంచనా వేశారు. టెండర్లు దాఖలు చేయడానికి ఈ నెల 23 వరకు గడువు ఉంది. 27న ప్రైస్ బిడ్స్ తెరుస్తారు. ఈ 86 పనుల్లో 31 నీటి సరఫరాకు సంబంధించినవి. మరో 6 పనులు సీవేజ్ మేనేజ్‌మెంట్ (మురుగునీటి నిర్వహణ) కోసం కేటాయించారు. మిగిలిన 49 పనులు పచ్చదనం, పార్కుల అభివృద్ధికి ఉద్దేశించినవి.

# నావికా దళానికి
# సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్ దేశ రక్షణలో అహర్నిశలు కంటికి రెప్పలా కాపాడుతూ అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శిస్తున్న భారత నావికాదళ సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. నావికాదళ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారు సేవలను స్మరించుకున్నారు. నౌకా దళ సిబ్బంది త్యాగం, దృఢ సంకల్పం, ధైర్య సాహసాలకు దేశం గర్విస్తుందని పేర్కొన్నారు. ఒకవైపు దేశాన్ని రక్షిస్తూ విపత్తు సమయాల్లో వారందించే సామాజిక సేవలు అజరామరమని ఒక సందేశంలో పేర్కొన్నారు.

# రాజకీయాలకు రజనీ గుడ్ బై



గుంటూరు, డిసెంబర్ 4, జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవి ఇచ్చేసరికి విడదల రజిని పొంగిపోయారు. జీవితాంతం రుణపడి ఉంటానని కూడా చెప్పుకొచ్చారు. అయితే జగన్ ఇప్పుడు ఆమెను నియోజకవర్గాల చుట్టూ తిప్పుతున్నారు. అయితే తిరిగి తిరిగి ఆమె ఇప్పుడు విసిగిపోతున్నారు. ఇక నియోజకవర్గం అంటూ జగన్మోహన్ రెడ్డికి చేతులెత్తి దండం పెడుతున్నారు. అదేంటి మంత్రిగా ఇచ్చేటప్పుడు రుణం తీర్చుకోలేనిది అన్నారు కదా.. అందుకే ఫలానా నియోజకవర్గానికి వెళ్లాల్సిందేనని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెబుతున్నారు. దీంతో గత కొద్ది రోజులుగా విడదల రజిని కనిపించకుండా మానేశారు. మంత్రి పదవి ఇచ్చిన మాట సరే. కానీ ఈ నియోజకవర్గాల తిప్పుడు ఏంటి అని ప్రశ్నిస్తున్నారు రజిని. పార్టీ పెద్దలకు మొరపెట్టుకుంటున్నారు. ఇలా అయితే కుదరదు అని తేల్చి చెబుతున్నారు.అయితే రజిని వైఖరిలో వైసీపీ శ్రేణులు పెద్దగా మార్పు గమనించడం లేదు. ఎందుకంటే ఆమె మాట తెలుసు వారికి. సైబరాబాద్ మొక్కను సార్ నేను అంటూ చంద్రబాబును నమ్మించారు. అక్కడకు కొద్ది రోజులకే వైసీపీలోకి జంప్ చేశారు. టిడిపిలో ప్లేస్ కల్పించిన ప్రత్తిపాటి పుల్లారావుకే ఝలక్ ఇచ్చారు. పోనీ మంచి నిర్ణయమే తీసుకున్నారు. ఇలా వెళ్లారో లేదో ఎమ్మెల్యే అయ్యారు. అక్కడకు కొద్ది రోజులకే ఈ రాష్ట్రానికి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి అధికారాన్ని చలాయించారు. అయితే ఇంతటి అవకాశం కల్పించిన జగన్మోహన్ రెడ్డి ఆమెను గుంటూరుకు వెళ్ళమని ఆదేశించడమే తరువాయి వెళ్లారు. కానీ ఘోర పరాజయం ఎదురు కావడంతో తన చిలకలూరిపేటకు వచ్చేసారు.అయితే చిలకలూరిపేటలో వద్దు ఈసారి రేపల్లెకు వెళ్ళండి అంటూ రజనీకి ఆదేశాలు ఇచ్చారు జగన్. అయితే మొన్ననే గుంటూరు వెళ్లాను కదా సార్.. రేపల్లె వెళ్లలేను అంటూ సెలవిచ్చారు రజిని. అయితే జగన్మోహన్ రెడ్డి మాటకు ఎదురు చెప్పేసరికి ఆయనకు ఆగ్రహం వచ్చిందట. పోనీ ఏదైనా ఇతర పార్టీలో చేరుదాము అంటే రజనీకి ఆప్షన్ లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటే రేపల్లె వెళ్లాలి. అక్కడ ఏమంత పరిస్థితి బాగాలేదు. కక్కలేక మింగలేక రజిని సతమతమవుతున్నారు. రేపల్లె వెళ్లడం లేదు.. ఉన్న చిలకలూరిపేటలో కనిపించడం లేదు. ఎందుకు వచ్చింది గొడవ అంటూ మళ్ళీ సైబరాబాద్ నీడకు వెళ్ళిపోయారంటూ సెటైర్లు పడుతున్నాయి. చూడాలి ఆమె రాజకీయ ప్రయాణం ఎలా ఉంటుందో?

# జగన్ విమాన ఖర్చుల గోల...

విశాఖపట్టణం, డిసెంబర్ 4, ఏపీలో నేతల విమాన ప్రయాణాలు, విదేశీ పర్యటనల ఖర్చుకు సంబంధించిన రచ్చ నడుస్తోంది. ప్రైవేటు పర్యటనలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఖర్చులు చూపించారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఈ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార కూటమిని టార్గెట్ చేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పర్యటనలు, విమాన ఖర్చులు ఇవి అంటూ సాక్షి మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. అయితే వాటికి పక్కా ఆధారాలు చూపించలేకపోతున్నారు. అయితే ఆధారాలతో తెలుగుదేశం కౌంటర్ ఇస్తుండడం మాత్రం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. సోషల్ మీడియాలో ఇదే వైరల్ అంశంగా మారింది.ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మంత్రి లోకేష్ పై దృష్టి పెట్టింది. గడిచిన 18 నెలల కాలంలో చాలాసార్లు విదేశీ పర్యటనలకు వెళ్లారు లోకేష్. ఆపై తరచూ హైదరాబాద్ వెళుతూ వస్తున్నారు. ఢిల్లీ పర్యటనలకు సైతం వెళ్తున్నారు. అయితే ఈ విమాన ఖర్చులన్నింటినీ ప్రభుత్వం భరిస్తోందని సాక్షి మీడియాలో పతాక శీర్షిక కథనాలు వచ్చాయి. దీనిపై టిడిపి కూడా ఘాటుగానే స్పందించింది. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించి సోషల్ మీడియాలో పెట్టారు. గడిచిన 18 నెలల కాలంలో లోకేష్ చాలా పర్యటనలకు వెళ్లారని.. కానీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు అన్నది తెలుగుదేశం పార్టీ మాట. అయితే ఫ్యాక్ట్ చెక్ సైతం ఇదే విషయాన్ని చాలా సార్లు చెప్పింది. లోకేష్ విమాన ఖర్చులన్నీ ఆయనే సొంతంగా భరిస్తున్నట్లు చెప్పుకొచ్చింది. చివరకు ప్రభుత్వంతో పాటు అధికారిక కార్యక్రమాలకు హాజరైన క్రమంలో సైతం లోకేష్ సొంత ఖర్చులను భరిస్తున్నారు.లోకేష్ తో పాటు కూటమి పెద్దల విషయంలో వైసిపి చేస్తున్న ప్రచారానికి చెక్ చెప్పాలని భావించింది తెలుగుదేశం. ఐదేళ్ల వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి విమాన ఖర్చులు సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకుందట. ఐదేళ్ల కాలంలో 222 కోట్ల రూపాయలు విమాన ఖర్చులకోసం రాష్ట్ర ప్రభుత్వం భరించింది అంటూ సోషల్ మీడియాలో టిడిపి ప్రచారం చేయడం ప్రారంభించింది. అయితే దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నోరు తెరవడం లేదు. వైసీపీ హయాంలో జగన్మోహన్ రెడ్డి పది కిలోమీటర్ల దూరాన్ని సైతం హెలిక్యాప్టర్ పై వెళ్లినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అదేం తప్పు కాదు కదా అన్నట్టు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మంత్రులు చెప్పేవారు. ఇప్పుడు లోకేష్ విషయంలో దుష్ప్రచారం జరగడంతో దానిపై క్లారిటీ ఇస్తూ టిడిపి ఈ కొత్త ప్రచారానికి తెర తీసింది. అయితే ఈ మొత్తం ఎపిసోడ్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బదనం అయినట్టు కనిపిస్తోంది.

## వైట్ టెర్రర్ షురూ...

హైదరాబాద్, డిసెంబర్ 4, ఢిల్లీలో ఇటీవల జరిగిన పేలుడు ఘటన తర్వాత భారత్ మరింత అప్రమత్తమైంది. ఈ పేలుడుతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కానీ, మన నిఘావర్గాలు అప్రమత్తం కావడంతో భారీ ముప్పు తప్పడంతోపాటు పెద్ద ఉగ్ర లింకులు బయటపడ్డాయి. ఈ ఘటన తర్వాత మన పోలీసులు, భద్రతా బలగాలు, ఇంటలిజెన్స్ సంస్థలు ఉగ్ర లింకులను కట్‌చేసే పనిలో పడ్డాయి. తాజాగా జమ్మూ కశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో ఉగ్రవాద కమాండ్లతో అనుబంధం ఉన్న డాక్టర్లను గుర్తించడానికి సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ అధికారులు కొత్తగా అన్వేషణలు చేస్తున్నారు. ముఖ్యంగా ఫరీదాబాద్ అల్‌ఫలా యూనివర్సిటీ డాక్టర్లను లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇటీవల అక్కడ 2,900 కిలోల అమ్మోనియం నైట్రేట్ పట్టుబడింది. వీరికి ప్రతిష్ఠాత్మక ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు.ఒమర్ ఉన్ నబీ అనే వ్యక్తి అమ్మోనియం నైట్రేట్ కొంత మోతాదు తీసుకెళ్లి ఢిల్లీలో పేలుడు చర్య చేశాడు. అల్‌ఫలా యూనివర్సిటీలో ఉపాధ్యాయులు షాహిన్, అదిల్, ముజామిల్ నబీ వంటి డాక్టర్లు జైష్?ఎ?మహ్మద్‌తో అనుబంధం ఉన్నట్టు గుర్తించబడ్డారు. ఈ డాక్టర్లు మెడికల్ కాలేజీల్లో పనిచేస్తూ ఉగ్ర కార్యకలాపాలకు సహకరించారు.కశ్మీర్‌కు చెందిన విభిన్న వ్యక్తులు దుబాయ్ ద్వారా పాక్ వెళ్లి ఎంబిబిఎస్ పూర్తి చేసి, తిరిగి భారత శాఖలలో నెలకొన్న ప్రైవేట్ ఉపాధి అవకాశాల్లో చేరుతున్నారు. పాక్ ఎంబీబిఎస్ కోర్సులకు గుర్తింపు ఇవ్వకపోతే కూడా, ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. ఢిల్లీలో 50 మంది పాక్ ఎంబీబిఎస్ డాక్టర్లు ఉన్నట్లు ప్రచారం.భారత ప్రభుత్వం ఉగ్రవాద రహిత పరిసరాల కోసం పాక్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన డాక్టర్లపై దృష్టి పెట్టింది. అల్ ఫలాహ్ యూనివర్సిటీపై విచారణలు కొనసాగుతున్న విషయం, అంతర్జాతీయ భద్రతా సాంఘిక వ్యవస్థలలో ప్రముఖంగా నిలబడింది. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశంగా మారింది.ఈ పరిణామాలు భారతీయ భద్రతా వ్యవస్థపై తీవ్రమైన సవాళ్లను తిరిగి ఉంచుతున్నాయి. ఉగ్రవాద సంఘటనలు, పైగా విద్యా సంస్థలలో నుంచి ఉగ్రవాదం పెరిగిపోవడం జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి

# 5 వేల కిలోమీటర్ల పాదయాత్రకు అంతా సిద్ధం

కడప, డిసెంబర్ 4, అది మామూలు ఓటమి కాదు. గెలుపు కూడా అంతే రీసౌండ్ చేయాలి. కమ్ బ్యాక్ ఆ ఓటమిని మరిపించేలా ఉండాలి. బౌన్స్ బ్యాక్ హిస్టరీని రిపీట్ చేయాలి. ఇదే ఎజెండాతో ఉన్నారట వైసీపీ అధినేత జగన్. మళ్లీ పవర్‌లోకి వచ్చి సత్తా చాటాలని స్కెచ్ వేస్తోన్న ఫ్యాన్ పార్టీ అధినేత..టూ ఇయర్స్ ప్లాన్‌ను రెడీ చేసి పెట్టుకున్నారట. ఎన్నికలకు ముందు రెండేళ్లు జనంలోనే ఉండేలా షెడ్యూల్ ప్రిపేర్ చేసి పెట్టుకున్నారట. ముందు జిల్లాల టూర్, ఆ తర్వాత పాదయాత్రతో ప్రజాక్షేత్రంలోనే గడిపేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నారట. ఇంతకు జగన్ ప్లానేంటి? అధినేత పాదయాత్ర వైసీపీని తిరిగి పవర్‌లోకి తెస్తుందా?సైలెంట్‌గానే ఉన్నారు. అప్పుడప్పుడు సమయం సందర్భం చూసి మాట్లాడుతున్నారు. అలా అని తమ అధినేత లైట్ తీసుకోలేదంటున్నారు ఫ్యాన్ పార్టీ లీడర్లు. 2029లో ఫ్యాన్ స్పీడును తట్టుకోవడం ఎవరి తరం కాదని..మళ్లీ అదే స్థాయిలో తిరిగి పవర్‌లోకి వస్తామని ధీమాగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే పార్టీని సెట్‌రైట్ చేసే పనిలో ఉన్నారట వైసీపీ అధినేత జగన్. ముందుగా నియోజకవర్గ ఇంచార్జ్‌లను మారుస్తూ..పనిచేస్తూ వారికి దిశానిర్దేశం చేస్తూ..తాను గ్రౌండ్‌లోకి దిగే నాటికి అంతా సిద్ధంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారట.న్యూఇయర్‌లో సరికొత్తగా..అంటే కూటమి రెండేళ్ల పాలన పూర్తయ్యే నాటికి జగన్ దూకుడు పెంచుతారని అంటున్నారు. వచ్చే ఏడాది సమ్మర్‌లో మొదట జిల్లాల టూర్‌కు ప్లాన్ చేస్తున్నారట జగన్. అంతలోపే అన్ని నియోజకవర్గాలకు ఇంచార్జ్‌ల నియామకం పూర్తి..సమన్వయకర్తలను యాక్టీవ్ చేయడంతో పాటు..పోరుబాటతో నిత్యం ప్రజల్లో ఉండేలా వ్యూహరచన రెడీ చేసి పెట్టారట. జిల్లాల టూర్ అయిపోగానే..పాదయాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారట జగన్.ఈ 15 నెలల కాలంలో వైసీపీ పెద్దగా ఆందోళన కార్యక్రమాలేం చేపట్టలేదు. ఓటమి నుంచి తేరుకోవడానికి చాలా టైమ్ పట్టింది. ఆ తర్వాత కూటమి ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిద్దామంటే నేతలను కేసులు వెంటాడాయి. చాలా నియోజకవర్గాల్లో లీడర్లు యాక్టీవ్‌గా లేరు. క్యాడర్ నైరాశ్యంలో ఉంది. ఇంకో రెండు మూడు నెలలు అయితే అందరూ రంగంలోకి దిగుతారని..ఆ తర్వాత అధినేత ఫీల్డ్‌లోనే ఉంటారని అంటున్నారు.మరోసారి పాదయాత్రకు సిద్ధమవుతున్నారట జగన్. 2019 ఎన్నికలకు ముందు దాదాపు 3వేల 650 కిలోమీటర్లు పాదయాత్ర చేసి 151 సీట్లతో అధికారాన్ని చేపట్టిన జగన్..మళ్లీ అధికారంలోకి రావాలంటే పాదయాత్ర ఒక్కటే మార్గంగా భావిస్తున్నారట. తెలుగు రాష్ట్రాల్లో పాదయాత్ర చేసిన ప్రతి నాయకుడు తదుపరి ఎన్నికల్లో గెలుస్తున్నారనే సెంటిమెంట్ కూడా జగన్‌ను రెండోసారి పాదయాత్ర చేసేలా ఉసిగొల్పుతోందని అంటున్నారు. ఈసారి దాదాపు 5వేల కిలోమీటర్ల పాదయాత్ర చేయాలని భావిస్తున్న జగన్..ఇప్పటి నుంచి పాదయాత్ర ఏర్పాట్లు, రూట్ మ్యాప్‌పై దృష్టి పెట్టారని టాక్.2029 ఎన్నికల వరకు జనంలోనే ఉండాలనుకుంటున్న జగన్..అదును చూసి అతిపెద్ద అస్త్రంతో రంగంలోకి దిగుతారని అంటున్నారు. సరిగ్గా ఎన్నికలకు రెండేళ్ల ముందు పాదయాత్రను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయట. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర మాత్రమే అయింది. మరో ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర స్టార్ట్ చేసి ఎన్నికల నోటిఫికేషన్ వరకు జనంలోనే ఉండాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ నిర్ణయించారని అంటున్నారు.సీఎం అయిన తర్వాత ప్రజలతో గ్యాప్ పెరిగిందని..2024లో అధికారం కోల్పోవడానికి అది కూడా ఓ కారణంగా చెబుతున్నారు. సాధారణ జనానికే కాదు..ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా తగిన సమయం ఇచ్చే వారు కాదన్న ప్రచారం జనంలోకి బలంగా వెళ్లింది. అప్పటి ప్రతిపక్షం కూడా ఇదే అంశాన్ని ఎక్కువగా ప్రచారం చేసింది. అయితే ఈ ప్రచారానికి చెక్ పెట్టాలన్న ఆలోచనతో ఉన్న జగన్.. తానెప్పుడూ జనం మనిషినే అని నిరూపించుకోవాలని భావిస్తున్నారట. అందుకే 2.0 పాదయాత్రను బిగ్ స్కేల్‌లో ప్లాన్ చేస్తున్నారట. రాష్ట్రంలోని ప్రతి జిల్లా.. ప్రతి మండలం టచ్ చేసేలా మొత్తం 175 నియోజకవర్గాలు కవర్ చేసేలా పాదయాత్రను డిజైన్ చేయాలని జగన్ పార్టీ నేతలను ఆదేశించినట్లు ఇన్‌సైడ్ టాక్. జగన్ 2 ఇయర్స్ ప్లాన్ ఎంతవరకు వర్కౌట్ అవుతుందో..పాదయాత్ర ఆయనను తిరిగి పవర్‌లోకి తీసుకొస్తుందో లేదో చూడాలి.

# నేడు అంతర్జాతీయ వాలంటీర్స్ దినోత్సవం




అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవాన్ని(వాలంటీర్స్ దినోత్సవం) ప్రతి సంవత్సరం డిసెంబరు 5వ తేదీన నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా శాంతి, అభివృద్ధిలకు మద్దతుగా వాలంటీరిజాన్ని మెరుగుపరచడంతోపాటు... కష్టాల్లో ఉన్నవారిని ఎలాంటి లాభాపేక్ష లేకుండా రక్షించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న వారందరి సేవను గుర్తించుకునేందుకు ఈ దినోత్సవం జరుపబడుతుంది.ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1985, డిసెంబర్ 17 తేదీన చేసిన 40/212 తీర్మానంలో ప్రతి సంవత్సరం డిసెంబరు 5వ తేదీన స్వచ్ఛంద దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించింది. ఐక్యరాజ్య సమితి ఇందులో కీలకపాత్ర పోషిస్తుండగా, రెడ్‌క్రాస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, వంటి అనేక ఎన్‌జిఒ సంస్థలు ఈ స్వచ్ఛంద సేవకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నాయి.దాదాపు 130 దేశాల్లో 86 ఫీల్డ్‌యూనిట్లతో ఐక్యరాజ్య సమితి వాలంటీర్ల సంఘం ఏర్పాటయింది. ఐక్యరాజ్య సమితి గుర్తించిన 7700 మంది వాలంటీర్లు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఏం జరిగినా అక్కడికి వెళ్ళి సేవలను అందిస్తారు. అంతేకాకుండా 2000వ సంవత్సరం నుండి ఐక్యరాజ్య సమితి ఆన్‌లైన్ వాలంటీర్ల విభాగం కూడా అందుబాటులోకి వచ్చింది. ఈ విభాగంలో ఫ్రెంచ్, స్పానిష్, ఇంగ్లీషు భాషల్లో ఆన్‌లైన్‌లో సేవలందించే వాలంటీర్లు పనిచేస్తారు.ఐక్యరాజ్య సమితి 1997, నవంబరు 20వ తేదీన జరిపిన జనరల్ అసెంబ్లీలో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ కు జపాన్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన మేరకు 52/17 తీర్మానంతో 2001వ సంవత్సరం అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవంగా ప్రకటించబడింది.

# ఒకే ఇంటినుంచి పోటీలో అత్తా కోడలు

ఆదిలాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది.. జిల్లాలో సర్పంచ్ ఎన్నికల పోటీలో ఒకే ఇంటి నుంచి అత్తా కోడళ్లు బరిలో నిలిచిన ఘటన చర్చనీయాంశం అవుతోంది... చదవుకోకున్నా తెలివితో పనిచేస్తానని అత్త చెబితే.. చదువుకున్న అమ్మాయిని గ్రామానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోడలు అంటోంది.. ఇక అత్త కోడళ్ల పోటీ ఎలా ఉండబోతుందో అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు..

ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ గ్రామపంచాయతీ నుండి వాళ్లిద్దరూ నేనంటే నేను అంటూ పోటీకి దిగారు. మొదటి విడతలో నామినేషన్ కూడా వేసారు. ఇప్పుడు పోటీకి నేనంటే నేను సై అంటూ ముందుకు వెళ్తున్నారు ఈ అత్తా కోడళ్ళు.. ఒకే కుటుంబంలో వీరి పోటీని చూసి అందరూ ఆశ్చర్య పోతున్నారు. గ్రామానికి చెందిన నాగోరావు భార్య తోడసం లక్ష్మీ బాయి, కొడుకు భార్య తోడసం మహేశ్వరి లు సర్పంచ్ బరిలో నిలిచారు.. ఈసారి మా గ్రామపంచాయతీ ఎన్నికల్లో మహిళ రిజర్వేషన్ రావడం తో సంతోషంగా ఉందని, మా కుటుంబం నుండి ఇద్దరం మహిళలం పోటీచేస్తున్నామని, ఎవరిదీ వారే తమ గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి గెలుపు ఎవరిని వరిస్తుందో, ఓటర్లు చదువుకున్న కోడలికి ఓటు వేస్తారో, లేదా సేవ చేస్తానంటున్న అత్తకు ఓటు వేస్తారో వేచి చూడాలి.... ఏది ఏమైనా ఒకే కుటుంబం నుండి ఇద్దరు మహిళలు పోటీ చేయడం పట్ల గ్రామంలో పెద్ద చర్చ మొదలైంది..

# ఫోర్ ఆర్ లు...

న్యూఢిల్లీ డిసెంబర్ 4, (న్యూస్ పల్స్) కేంద్ర ప్రభుత్వం కొత్త స్లోగన్ తీసుకొస్తోంది. అదే ఆర్ఆర్ఆర్ఆర్. సుజలాం భారత్ 2025లో భాగంగా.. ఈ ప్లాన్ చేసింది. జల్ జీవన్ మిషన్ లో ఈ 4ఆర్ లు ఉంటాయి. అందులో మొదటి ఆర్. అంటే రెడ్యూస్ (నీటి వినియోగం తగ్గించడం), రెండోఆర్. అంటే రీయూజ్, మూడో ఆర్. అంటే రీచార్జ్ (నీటి వనరుల లభ్యత పెంచుకోవడం, భూగర్భ జలాలు పెంచడం), ఇక నాలుగో ఆర్. అంటే రీసైకిల్ (నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించడం). జల శక్తి ఆధ్వర్యంలో, నీతి ఆయోగ్ సహకారంతో ఈ ప్లాన్ చేస్తోంది.దేశంలో పట్టణీకరణ విపరీతంగా పెరుగుతోంది. ఉద్యోగ, ఉపాధి, విద్య, ఇతర అవకాశాల కోసం జనం సిటీల బాట పడుతున్నారు. అయితే, దీనికి తగినట్టు వాటర్ అందుబాటులో లేదు. అందుకే మహా నగరాల్లో నీటి కటకట ఏర్పడుతూ ఉంటుంది. పెరుగుతున్న పట్టణీకరణకు సరిపడా నీటిని అందుబాటులో ఉంచడానికి ఏం చేయాలనే దానిపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో కొత్త స్లోగన్ తీసుకొచ్చింది.సుజలాం భారత్ విజన్ కింద కొన్ని కొత్త కార్యక్రమాలు చేపట్టనుంది. దేశంలోని రాష్ట్రాలు, కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లనుంది. ఈ ప్రాజెక్టులో నదులను పునరుజ్జీవం చేయడం, వాటర్ మేనేజ్ మెంట్, టెక్నాలజీ ఆధారంగా నీటి వినియోగం, భూగర్భ జలాలు పెంచడం, సురక్షిత మంచినీటి సరఫరా లాంటివి ఏర్పాటు చేయడానికి కేంద్రం కసరత్తు చేస్తోంది.సరైన తాగు నీరు లేకపోవడం వల్ల దేశంలో కొన్ని కోట్ల మంది ప్రజలు తమ దైనందిన జీవితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. సరైన నీటి లభ్యత లేకపోవడం వల్ల శానిటేషన్ సమస్య ఏర్పడుతోంది. అనారోగ్యాల పాలవుతున్నారు. న్యూట్రిషన్ కూడా అందడం లేదు. ఇలాంటి సమస్యలు అన్నిటికీ పరిష్కారం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.నదుల పునరుజ్జీవం కోసం నమామి గంగే లాంటి ప్రాజెక్టులు ఇంకా చేపట్టడానికి అవకాశం ఉంది. దేశంలో ఉన్న ఇతర నదుల విషయంలో కూడా ఇలాంటి నినాదంతో ముందుకెళ్లనుంది. ఇప్పటివరకు సుమారు 15 కోట్ల మందికి జల్ జీవన్ మిషన్ ద్వారా ట్యాప్ వాటర్ అందించినట్టు చెబుతున్న ప్రభుత్వం 2028 నాటికి దేశంలోని ప్రతి ఇంటికి ట్యాప్ వాటర్ అందించాలనే టార్గెట్ చేసింది. ప్రతి ఇంట్లో ప్రతి మనిషికి రోజుకు కనీసం 55 లీటర్ల నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే భూగర్భ జలాలను పెంచే క్రమంలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ మీద ఫోకస్ చేయనుంది.

# జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు, నల్లజాతి సూరీడు, భారతరత్న నెల్సన్ మండేలా

## –నేడు ఆయన వర్ధంతి



జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో జరిగిన ఒక మారణకాండకు సంబంధించి 27 సంవత్సరాలపాటు “రోబెన్” అనే ద్వీపంలో జైలు శిక్షను అనుభవించిన మండేలా, 20వ శతాబ్దపు అత్యంత సుప్రసిద్ధులైన ప్రపంచ నాయకులలో ఒకరిగా గుర్తింపు పొందారు. దీంతో ఆయన, జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపే పోరాటాలకు, వర్ణ సమానతకు ఒక సంకేతంలాగా నిలిచారు. జీవిత వివరాలను చూస్తే... నెల్సన్ రోలిహ్లాహ్లా మండేలా, దక్షిణాఫ్రికా దేశ మాజీ అధ్యక్షుడు. కేప్ ప్రాంతంలోని ఉమటా జిల్లా, మవెజో అనే ఊర్లో 1918, జూలై 18వ తేదీన ఈయన జన్మించారు. దక్షిణాఫ్రికాకు పూర్తి స్థాయి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మొట్టమొదటి నాయకుడిగా ఈయన కీర్తి గడించారు. అధ్యక్షుడు కాకమునుపు ఇతను జాతి వివక్ష వ్యతిరేఖ ఉద్యమకారుడిగా, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు, దానికి సాయుధ విభాగం అయిన “ఉంకోంటో విసిజ్వే”కు అధ్యక్షుడిగా పనిజేశారు.ఫిబ్రవరి 11, 1990లో జైలునుండి విడుదల అయిన తరువాత నెల్సన్ మండేలా రాజకీయంగా తన లక్ష్యాన్ని సాధించడానికి, దేశంలో నెలకొన్న జాతి వైర్యాన్ని నివారించడానికి, అందరి మధ్య సయోధ్య పెంచడానికి కృషి చేశారు. తన పూర్వపు శత్రువులనుండి కూడా ప్రశంసలు అందుకొన్నారు. వందకు పైగా అవార్డులు, సత్కారాలతో వివిధ దేశాలు, సంస్థలు ఈయనను గౌరవించాయి. వాటిలో 1993లో లభించిన నోబెల్ శాంతి బహుమతి ముఖ్యమైనది. స్వదేశంలో మండేలాను “మదిబా” అని వారి తెగకు సంబంధించిన గౌరవసూచకంతో పిలుస్తుంటారు.జాతిపిత మహాత్మా గాంధీ బోధించిన శాంతియుత విధానాలు, అహింస, శత్రువును సంస్కారయుతంగా ఎదుర్కొనే పద్ధతి తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని మండేలా చాలాసార్లు వెల్లడించారు. భారత దేశం కూడా మండేలాను “జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ సయోధ్య బహుమతి”తో సత్కరించింది.అలాగే... 1990లో భారత ప్రభుత్వం మండేలాకు మనదేశపు అత్యున్నత పురస్కారం అయిన భారతరత్నను ప్రకటించింది. మన దేశం నుంచి ఆయనకు ఎంతో గౌరవం లభించిందన్న దానికి నిదర్శనంగా అనేక విగ్రహాలు కూడా చాలాచోట్ల నెలకొల్పబడ్డాయి. కొన్ని కూడళ్ళకు, రోడ్లకు మండేలా పేరు పెట్టారు. ఢిల్లీలో కూడా ఆయన పేరుతో ఒక “నెల్సన్ మండేలా రోడ్” ఉంది.అదలా ఉంచితే... 1994లో మండేలా తన 77 సంవత్సరాల వయసులో అధ్యక్ష పదవిని చేబట్టి ఆ పదవిని అలంకరించిన వారిలో అతి పెద్ద వయస్కుడయ్యారు. రెండవసారి మరలా ఎన్నికల్లో పోటీ చేయరాదని నిశ్చయించుకున్న ఆయన, 1999లో పదవీ విరమణ చేశారు. జూలై 2001లో ఆయనకు ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, రేడియేషన్ వైద్యం చేశారు.తన పదవీ విరమణ తరువాత ఎయిడ్స్ వ్యాధి నివారణకు మండేలా విశేషంగా కృషి చేశారు. ఆ తరువాత జూన్ 2004లో తాను రాజకీయ జీవితం నుండి విరమించుకుని, అధికంగా కుటుంబంతో గడపాలని అనుకుంటున్నట్లు మండేలా ప్రకటించారు. అయితే ఆయన పూర్తిగా సమాజం నుంచి దూరం కాలేదుగానీ, 2003 తరువాత తన సాంఘిక కార్యక్రమాలను బాగా తగ్గించుకున్నారంతే..!కొంత కాలంగా తీవ్ర శ్వాసకోశ సంబంధ అస్వస్థతతో బాధపడుతూ 2013 డిసెంబర్ 5 న 20:50 (దక్షిణాఫ్రికా ప్రాంతీయ సమయం) కగంటలకు జోహెన్స్ బర్గ్ లో మరణించారు. వివిధ దేశాలనుండి సుమారుగా 90 మంది ప్రతినిధులు ఆయన అంత్యక్రియలకు హాజరు అయ్యారు.

# హనుమకొండ జిల్లాలో ఇంట్రెస్టింగ్ గా మారిన సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం



హనుమకొండలో సర్పంచు అబ్యర్థుల ప్రచారం వినూత్నంగా మారింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు కొత్త కొత్త ఆలోచనలతో బరిలోకి అభ్యర్థులు దిగుతున్నారు. కమలాపూర్ మండలం నేరెళ్ళ గ్రామంలో ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. గ్రామానికి ప్రధాన సమస్యగా మారిన కోతులను తరిమేందుకు ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు కొత్త ప్రయోగం చేసారు. తమ అనుచరులకు ఎలుగుబంటి, చింపాంజీ వేషధారణ వేసి ప్రచారంలో సర్పంచ్ అభ్యర్థులు శ్రీరామ్, నాగలక్ష్మి మునిగిపోయారు. ఎలుగుబంటి, చింపాంజీ వేషధారణలతో గ్రామంలో వినూత్న ప్రచారం కొనసాగుతోంది. కోతులను తరుముతూ ఓట్లు అభ్యర్థన, గెలిపిస్తే కోతుల సమస్య తీరుస్తామని హామీ ఇస్తున్నారు. నేరేళ్ల గ్రామంలో 1537 మంది ఓటర్లు ఉండగా, 11 తేదీన మొదటి విడత పోలింగ్ జరగనుంది.



# కోకాపేటలో రికార్డుల మోతే..



హైదరాబాద్, డిసెంబర్ 4, కోకాపేట నియోపొలిస్‌లోని ప్రీమియం భూములకు మూడో విడత ఈ–వేలం ప్రక్రియ ముగిసింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహించిన ఈ వేలంలో రెండు ప్లాట్లకు ఎకరానికి రూ.118 నుంచి 131 కోట్ల వరకు ధర పలికింది. మొత్తం 8.04 ఎకరాలకు రూ.1,000 కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం మూడు విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్లు లభించింది. నాలుగో విడత శుక్రవారం వేలం జరగనుంది. మొత్తంగా ఐదు వేలకోట్లను ప్రభుత్వం ఆశిస్తోంది. కోకాపేటలో హెచ్‌ఎండీఏ మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో వేలం వేస్తోంది. మొత్తం ఆరు ప్లాట్లు 27 ఎకరాలు వేలం అయ్యాయి. మొత్తం ఆదాయం రూ.3,708 కోట్లు వచ్చింది. ఇది హైదరాబాద్ చుట్టూ భూమి అభివృద్ధి, రోడ్లు, పార్కులు వంటి ప్రాజెక్టులను చేపడతారు. కోకాపేట నియోపొలిస్ లేఅవుట్‌లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల వేలాలు భారీగా నిధులు కురిపిస్తున్నాయి. 2021 జూన్‌లో మొదటి విడతలో 8 ప్లాట్లు సుమారు 50 ఎకరాలు కు రూ.2,000 కోట్లు, 2023 ఆగస్టులో రెండో విడతలో 7 ప్లాట్లు 45.33 ఎకరాలు కు రూ.3,300 కోట్లు సమకూరాయి. మొత్తం 95 ఎకరాలకు ఎకరానికి రూ.40 నుంచి 100.75 కోట్ల వరకు ధరలు పలికి, హెచ్‌ఎండీఏకు రూ.5,300 కోట్లు ఆదాయం వచ్చింది.

హెచ్‌ఎండీఏ 2021 జూన్ 10న మొదటి విడత ఈ–వేలాన్ని ఓూఅ పోర్టల్ ద్వారా నిర్వహించింది. కోకాపేట్‌లోని నియోపొలిస్ లేఅవుట్‌లో 8 ప్లాట్లు వేలం శారు. అప్పట్లో అప్‌సెట్ ప్రైస్ ఎకరానికి రూ.25 కోట్లు పెట్టారు. బిడ్ రేంజ్ ఎకరానికి రూ.31.2 నుంచి 60.2 కోట్ల వరకు పలికింది. గరిష్ఠ బిడ్ రూ.60 కోట్లు ఒక ఎకరం ప్లాట్‌కు పెట్టి కొనుగోలు చేశారు. ఐదేళ్లోలనే ఈ రేటు రూ. 131 కోట్లకు చేరుకుంది. ప్రెస్టీజ్ గ్రూప్ వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ వేలం హైదరాబాద్‌ను దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా మారింది. 2023 ఆగస్టు 3న రెండో విడత వేలం జరిగింది. 7 ప్లాట్లు 3.6 నుంచి 9.71 ఎకరాల వరకు ఉన్నాయి. అప్‌సెట్ ప్రై ధర ఎకరానికి రూ.35 కోట్లు కానీ ఎకరానికి రూ.67.25 నుంచి 100.75 కోట్ల వరకు కొనుగోలుచేశారు. గరిష్ఠ బిడ్ రూ.100.75 కోట్లు రాజపుష్పా ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ ? 3.6 ఎకరాల ప్లాట్‌కు దక్కించుకుంది.

# హైదరాబాద్ ప్రైవేట్ రాకెట్ ప్రత్యేకతలేంటి?

హైదరాబాద్, డిసెంబర్ 4, 'ఓపెనింగ్ స్పేస్ ఫర్ ఆల్ (అంతరిక్షంలో అందరికీ అవకాశం)"ఈ నినాదంతో స్థాపించిన హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ రాకెట్‌ను తయారు చేసింది. ఇది భారతదేశపు తొలి వాణిజ్య ఆర్బిటాల్(భూకక్ష్య ) రాకెట్‌గా ప్రకటించింది.ఈ రాకెట్‌కు భారత అంతరిక్ష పితామహుడిగా పేరొందిన విక్రమ్ సారాభాయ్ పేరుతో విక్రమ్-1గా నామకరణం చేసింది.ఇప్పటివరకు రాకెట్లు అంటే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆధ్వర్యంలోనే తయారయ్యేవి.అయితే, కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష సాంకేతికతలో ప్రైవేట్ సంస్థలకు అవకాశాలు కల్పించడంతో విక్రమ్-1 రాకెట్‌ను తయారు చేసి ప్రయోగానికి సిద్ధమవుతోంది స్కైరూట్ ఏరో స్పేస్ కంపెనీ.ఉపగ్రహాల(శాటిలైట్స్)ను అంతరిక్షంలోకి తీసుకెళ్లడంలో లాంచ్ వెహికల్స్‌దే కీలకపాత్ర.ఉపగ్రహాల బరువును బట్టి లాంచ్ వెహికల్‌ను ప్రయోగిస్తుంటారు.ఇస్రో తరఫున పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్(పీఎస్ఎల్వీ), జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్(జీఎస్ఎల్వీ) వంటి వాటిని ఉపయోగిస్తున్నారు.వీటిల్లో పీఎస్ఎల్వీకి సుమారు 1400 కిలోల బరువు వరకు మోసుకెళ్లే సామర్థ్యం ఉంది.

జీఎస్ఎల్వీకి సుమారు 4 వేల నుంచి 6 వేల కిలోల పేలోడ్ సామర్థ్యం ఉంది.స్పేస్ టెక్నాలజీలో ప్రైవేటు పెట్టుబడులు లేదా కంపెనీలకు అవకాశం కల్పించాలని జూన్ 2020లో కేంద్ర కేబినెట్ నిర్ణయించడంతో ఈ రంగంలో పెద్దసంఖ్యలో కంపెనీలు ఏర్పాటయ్యాయి.అప్పటికి రెండేళ్ల కిందటే 2018లో స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ ప్రారంభించారు ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, భరత్ కుమార్ డాకా."ఆ సమయంలో పెద్దగా ఫండింగ్ లేదు. స్పేస్ టెక్నాలజీలో అంత ప్రతిభ లేదు. భారత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో లబ్ధి పొందాం" చెప్పారు పవన్ కుమార్.పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీతో పోల్చితే స్కైరూట్ అభివృద్ధి చేసిన విక్రమ్ -1 లాంచ్ వెహికల్ పే లోడ్ సామర్థ్యం చాలా తక్కువే.దీని పే లోడ్ సామర్థ్యం 500 కిలోలుగా ఉందని, ప్రాథమికంగా 350 కిలోల పే లోడ్ సామర్థ్యంతో ప్రయోగాలు చేపడతామని పవన్ కుమార్ చెప్పారు ."40 టన్నుల బరువు, 20 మీటర్ల ఎత్తుతో లాంచ్ వెహికల్ ఉంటుంది" అని చెప్పారు.భూ ఉపరితలం నుంచి 500 కిలోమీటర్ల వరకు అంతరిక్షంలోకి వెళ్లగలదని స్కైరూట్ కంపెనీ చెబుతోంది.సెకనుకు 8 కిలోమీటర్ల వెలాసిటీతో శాటిలైట్‌ను ప్రవేశపెట్టే సామర్థ్యం కలిగివుంది.1.7 మీటర్ల వ్యాసంతో 1200 కేఎన్ థ్రస్ట్ సామర్థ్యంతో లాంచ్ వెహికల్ తయారైంది.త్రీడీ ప్రింటెడ్ లిక్విడ్ ఇంజిన్ కారణంగా సాధారణ ఇంజిన్‌తో పోలిస్తే 50 శాతం తక్కువ బరువుంటుంది. సాలిడ్ ఫ్యూయెల్ బూస్టర్స్, కార్బన్ కంపోజిట్ స్ట్రక్చర్ (కార్బన్ ఫైబర్‌తో తయారైనవి) కలిగివుంది.ఏరోస్పేస్ కంపెనీ 2022 నవంబర్ 18న సబ్ ఆర్బిటాల్(భూ ఉప క్షక్ష్య) లాంచ్ వెహికల్‌ను ప్రయోగించింది. దీనికి అప్పట్లో విక్రమ్-ఎస్‌గా నామకరణం చేశారు.ఇది భూమి ఉపరితలం నుంచి 80 కిలోమీటర్ల వరకు వెళ్లి భూ ఉపకక్ష్యను తాకింది. కానీ, దీనికి శాటిలైట్‌ను ప్రవేశపెట్టే సామర్థ్యం లేదు. "విక్రమ్- ఎస్ అనేది టెస్ట్ రాకెట్ మాత్రమే" అని పవన్ చెప్పారు.ఆ ప్రయోగం విజయవంతం కావడంతో విక్రమ్-1 లాంచ్ వెహికల్ చేపట్టి మూడేళ్లలోనే పూర్తి చేసినట్లుగా పవన్ కుమార్ చందన చెప్పారు ."భవిష్యత్తులో ప్రతి నెలా ఒక లాంచ్ వెహికల్ తయారు చేసి అందుబాటులోకి తీసుకురావాలనేది మా లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన అన్నారు.

కేంద్ర ప్రభుత్వం 2023లో ఇండియన్ స్పేస్ పాలసీ తీసుకొచ్చింది.ప్రభుత్వేతర సంస్థలు కూడా అంతరిక్ష సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఈ పాలసీ ఎంతో కీలకంగా మారిందని ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ చెప్పారు."స్పేస్ పాలసీ స్కైరూట్ వంటి ఎన్నో సంస్థలకు మరింత చేయూతనిచ్చింది" అని ఆయన అన్నారు.ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్(ఇన్ స్పేస్) నిబంధనలకు లోబడి ప్రైవేటు సంస్థలు పనిచేయాల్సి ఉంటుంది.మూడేళ్ల కిందట ఇన్ స్పేస్ ప్రారంభించడం వెనుక ఉద్దేశం.. ప్రైవేట్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవకాశం కల్పించాలన్నదే అని ఇన్ స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా చెప్పారు.విక్రమ్ -2 లాంచ్ వెహికల్‌ను 2026లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా భరత్ కుమార్ డాకా చెప్పారు.కంపెనీ చెబుతున్న వివరాల ప్రకారం, విక్రమ్-2 లాంచ్ వెహికల్ 900 కిలోల పేలోడ్ సామర్థ్యంతో తయారు చేస్తున్నట్లుగా ఉంది. ఇందుకు అడ్వాన్స్‌డ్ క్రయోజెనిక్ ఇంజిన్ తయారు చేస్తున్నట్లగా చెబుతోంది.భవిష్యత్తులో రీ యూజబుల్ లాంచ్ వెహికల్స్(రాకెట్స్) తయారు చేయాలనే ఆలోచన ఉన్నట్లుగా పవన్ చెప్పారు.ప్రపంచ దేశాలకు శాటిలైట్స్ లాంచ్ చేయడానికి రాకెట్ల అవసరం చాలా ఉందని, ఆ ఆలోచనతోనే లాంచ్ వెహికల్స్ తయారీకి స్కైరూట్ నిర్ణయించిందని చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా ప్రైవేటు రాకెట్ తయారీ కంపెనీలు పెద్దయెత్తున వస్తున్నాయి. అమెరికాలో స్పేస్-ఎక్స్ సహా వివిధ సంస్థలున్నాయి. రాకెట్స్ తయారు చేస్తున్నాయి. భారత్‌లో లాంచ్ వెహికల్స్‌ను ప్రైవేటు కంపెనీలు తీసుకురావడం కీలక మలుపుకానుంది.2015 నుంచి 2024 మధ్య 393 విదేశీ, మూడు స్వదేశీ కమర్షియల్ శాటిలైట్స్‌ను ఇస్రో ప్రయోగించింది. దీని ద్వారా 439 మిలియన్ యూఎస్ డాలర్ల ఆదాయం సమకూరింది.భారత స్పేస్ రంగంలో 2024లో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్డీఐ) అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.దేశీయంగా ఇప్పటికే స్పేస్ టెక్నాలజీలో 300కుపైగా స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని పవన్ గోయెంకా చెప్పారు.ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ డేటా ప్రకారం, సెప్టెంబర్ 30, 2025 నాటికి 376 స్టార్టప్‌లు కేంద్రానికి దరఖాస్తు చేసుకున్నాయి.ఒకే ఒక్క స్టార్టప్ ఉండగా , 2024 నాటికి 200 కంపెనీలు వచ్చాయని నిరుడు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రకటించింది.గ్లోబల్ స్పేస్ ఇండస్ట్రీలో భారత్ వాటా 2021లో రెండు శాతం (8.4 యూఎస్ బిలియన్ డాలర్లు)గా ఉంది.2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, ఎగుమతులు 11 బిలియన్ డాలర్లకు చేరుకుంటాయని భారత ప్రభుత్వం అంచనా వేస్తోంది.భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ కంపెనీల రాక అంతరిక్ష రంగాన్ని కచ్చితంగా సరికొత్త దిశగా తీసుకెళుతుందని సోమనాథ్ చెప్పారు.

# రైజింగ్ సమ్మిట్ పైఆశలు

హైదరాబాద్, డిసెంబర్ 4, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో కీలక ఆర్థిక కేంద్రంగా నిలబెట్టాలనే సుదూర లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు అంకురార్పణ చేస్తోంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని 'ఫ్యూచర్ సిటీ'లో నిర్వహించడానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ సమ్మిట్‌ను కేవలం పెట్టుబడుల సమావేశంగా కాకుండా, రాబోయే రెండు దశాబ్దాల తెలంగాణ ప్రగతి ఆవిష్కరణ వేదికగా చెప్పవచ్చు.

విజన్ డాక్యుమెంట్

తెలంగాణ రైజింగ్-2047తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ముఖ్య కేంద్ర బిందువు తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్. 2047 నాటికి మన దేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుంది. ఈ ఉత్సవాల నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని వి3వి ట్రిలియన్ డాలర్ల (వి250వి లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న రోడ్ మ్యాప్ తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్లో ఉంది. దీని ద్వారా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దీర్ఘకాలిక పునాదిని పటిష్టంగా వేయాలన్న యోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

1. ప్రపంచ పెట్టుబడుల ఆకర్షణ - ఉద్యోగ కల్పన

తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి, పెట్టుబడులు పెట్టేందుకు పురికొల్పడమే ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా, తయారీ, ఐటీ/టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, మరియు ఎలక్ట్రిక్ వాహనాలు వంటి రంగాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం ధ్యేయంగా పెట్టుబడుల ఆకర్షణ చేపట్టనున్నారు. దీని ప్రభావం విషయానికి వస్తే, దిగ్గజ కంపెనీలు, పారిశ్రామికవేత్తల పెట్టుబడుల ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వేగంగా వృద్ధి చేయడం ఒక అంశంగా చెప్పవచ్చు. ఇంకో అంశం ఏమిటంటే, తెలంగాణ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు సృష్టించడం, అందులోనూ అత్యున్నత వేతన ఉద్యోగావకాశాలు కల్పించడం. దీనివల్ల రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గిపోవడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

2. తెలంగాణకు గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్ - నమ్మకమైన గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రం

ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025 ద్వారా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచడం తెలంగాణ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం.

ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన, నమ్మకమైన పెట్టుబడి గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. భారతదేశంలోనే 'వ్యాపారం చేయడానికి సులభంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచే పలు సంస్కరణలను ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. తద్వారా తెలంగాణ రాష్ట్రానికి మెరుగైన బ్రాండింగ్, స్థిరమైన ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రవహించడానికి మార్గం సుగమం అవుతుంది.

3. తెలంగాణ విజన్ 2047 ఆవిష్కరణ - ఆర్థిక స్వావలంబన

భారతదేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా వి3వి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చేందుకు సమగ్ర ఆర్థిక, సామాజిక, మౌలిక సదుపాయాల రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ సమ్మిట్‌కు వచ్చే ప్రపంచ నేతలు, ఆర్థికవేత్తలు, అంతర్జాతీయ మీడియా ముందు తెలంగాణ విజన్ -2047ను ఆవిష్కరించడం ద్వారా కలిగే ప్రభావం విషయానికి వస్తే, అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో విశ్వాసం కలుగుతుంది. ఇది కేవలం ఒక రాష్ట్ర ఆకాంక్షగా కాకుండా, అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పకడ్బందీ ప్రణాళిక రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉందన్న సంకేతం వెళుతుంది. దీనివల్ల పెట్టుబడిదారులు నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు కుమ్మరిస్తారన్నది ప్రభుత్వ యోచన.

4. సమ్మిళిత, సమతుల్య వృద్ధి - అన్ని ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక

ఈ గ్లోబల్ సమ్మిట్‌లో కేవలం హైదరాబాద్‌ను మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలైన వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో కూడా ఐటీ, పరిశ్రమలు నెలకొల్పేలా చేయడం.

ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల వృద్ధిపై అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం ప్రదర్శించనుంది. దీని ద్వారా ఆర్థిక ఫలాలు కేవలం హైదరాబాద్ వంటి నగరానికి మాత్రమే కాకుండా, అన్ని ప్రాంతాలకు సమంగా అందించాలన్న ఉద్దేశాన్ని ప్రకటించడం. దీనివల్ల ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లో నమ్మకాన్ని నెలకొల్పడం ద్వారా నగరాలకు, పట్టణాలకు వలసలను నివారించే ప్రయత్నంగా చెప్పవచ్చు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 అనేది రాష్ట్ర భవిష్యత్తుకు టార్చ్ బేరర్ వంటిదని ప్రభుత్వం భావిస్తోంది. ఇది పెట్టుబడులను, ఉద్యోగాలను ఆకర్షించడమే కాక, రాష్ట్రాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రధాన శక్తిగా నిలబెట్టడానికి వేస్తున్న పటిష్టమైన తొలి అడుగుగా అభివర్ణిస్తోంది.

# దావోస్ బిజినెస్ ఫోరమ్ స్థాయిలో ఏర్పాట్లు

హైదరాబాద్, డిసెంబర్ 4, వరల్డ్ ఫేమస్ స్పోర్ట్స్ స్టార్ మెస్సీ హైదరాబాద్ రాబోతున్నారు. ఆయనతో కలిసి ఫుట్‌బాల్ ఆడబోతున్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ఆ క్రీడా వేదికపై కూడా తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రమోట్ చెయ్యబోతున్నారు. సో, గ్లోబల్ సమిట్ కోసం గ్లోబును చుట్టెయ్యాలన్నంత కమిట్‌మెంట్‌తో నడుస్తోంది రేవంత్ సర్కార్. అందుకే, దావోస్ బిజినెస్ ఫోరమ్‌కి ఏమాత్రం తీసిపోని రీతిలో వరల్డ్ క్లాస్ ఇంటర్నేషనల్ ఈవెంట్ రేంజ్‌లో ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.500 కంపెనీల నుంచి వెయ్యి మందికి పైగా గ్లోబల్ డెలిగేట్లు కొలువుదీరే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్.. ఇదొక్కటే ప్రస్తుతానికి రేవంత్ సర్కార్ ముందున్న మేజర్ టార్గెట్. ముచ్చర్లలోని భారత్ ఫ్యూచర్ సిటీలో మరో నాలుగైదు రోజుల్లో మొదలయ్యే గ్లోబల్ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది తెలంగాణ ప్రభుత్వం. తెలంగాణ అంటే భవిష్యత్ భారతానికి గర్వకారణం అనేది గ్లోబల్ సమిట్ మెయిన్ థీమ్.కేంద్రం నుంచే కాదు, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా గ్లోబల్ సమిట్‌కు సహకారం ఆశిస్తోంది తెలంగాణ సర్కార్. డిసెంబర్ 4వ తేదీన మంత్రులు స్వయంగా వెళ్లి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్‌కి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్-హర్యానాకు దామోదర్ రాజనర్సింహ, కర్ణాటక-తమిళనాడుకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తర ప్రదేశ్‌కు పొంగులేటి, రాజస్థాన్‌కు పొన్నం ప్రభాకర్, చత్తీస్‌గడ్‌కు కొండా సురేఖ, పశ్చిమ బెంగాల్‌కి సీతక్క, మధ్యప్రదేశ్‌కి తుమ్మల నాగేశ్వరరావు, అస్సామ్‌కి జూపల్లి కృష్ణారావు, బీహార్‌కి వివేక్ వెంకటస్వామి, ఒడిషాకి వాకిటి శ్రీహరి, హిమాచల్ ప్రదేశ్‌కి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, మహారాష్ట్రకు మొహమ్మద్ అజారుద్దీన్.. వెళ్లి ఆహ్వానపత్రాలు అందజేస్తారు. ఢిల్లీ ముఖ్యమంత్రికి, కేంద్ర మంత్రులకు, గవర్నర్లకు తెలంగాణ ఎంపీలు ఆహ్వానం అందిస్తారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెళతారు.ఇప్పటికే అనేక మంది పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం వెళ్లింది. కేంద్ర ప్రభుత్వ పెద్దల్ని పిలవడానికి స్వయానా ముఖ్యమంత్రి రేవంతే ఢిల్లీలో మకాం వేశారు. ఇలా, వీలైనంత ఎక్కువమంది పొలిటికల్ ఐకాన్స్‌ని, కార్పొరేట్ దిగ్గజాల్ని రప్పించి సమ్మిట్‌ని సూపర్‌సక్సెస్ చేయాలన్నది టీ-సర్కార్ ఆలోచన. 2034 నాటికి వన్ ట్రిలియన్, 2047 నాటికి త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యాన్ని సాధించడానికి ఈ విజన్ డాక్యుమెంట్‌ని రోడ్ మ్యాప్‌గా భావిస్తోంది రేవంత్ ప్రభుత్వం.ఫోర్త్‌సిటీలో గ్లోబల్ సమిట్ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు, మూడు షిఫ్టుల్లో పనిచేసి వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాలనుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతిని, కళా, వారసత్వ సంపదను పరిచయం చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 5వ తేదీ సీఎం రేవంత్‌రెడ్డి సమ్మిట్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.

# పోలీసుల బంపర్ ఆఫర్‌కు నో.. బయటకొచ్చి మరో ఐ బొమ్మ పెడతానన్న రవి.




హైదరాబాద్, డిసెంబర్ 4, సినీ పైరసీ వెబ్‌సైట్ ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.. కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. రవి నుంచి కీలక సమాచారం సేకరించారు. ఐ బొమ్మ సినీ పైరసీని రవి ఒక్కడే చేశాడని నిర్ధారించుకున్న పోలీసులు..పైరసీ ద్వారా సంపాదించిన మొత్తంలో 30 కోట్లకు సంబంధించిన బ్యాంకు లావాదేవీ వివరాలను సేకరించారు. అంతేకాకుండా.. పైరసీ కేసు దర్యాప్తులో పోలీసులు మరింత లోతుగా వెళ్తున్నారు.. ఇంత పెద్ద వలయాన్ని నిర్వహించిన రవిపై పోలీసులు ఇప్పటివరకు రెండు విడతల్లో ఎనిమిది రోజులపాటు కస్టడీ తీసుకుని విచారణ జరిపిన విషయం తెలిసిందే. అయితే ఆ విచారణలో బయటకు వచ్చిన కొన్ని కీలక సమాచారాలతో కేసు కొత్త మలుపు తిరిగింది. అందుకే తాజాగా పోలీసులు మరోసారి నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. మొత్తం మూడు వేర్వేరు కేసుల్లో పీటీ వారెంట్ మీద ఇప్పటికే రవిని కోర్టు ఎదుట హాజరుపరచిన సైబర్ క్రైమ్ అధికారులు.. ఇప్పుడు ఈ మూడు కేసులన్నింటికీ ఐదు రోజులపాటు కస్టడీ ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసుల్లో ఉన్న డిజిటల్ సాక్ష్యాలు, లావాదేవీల రూట్లు, రవి ఇచ్చిన సమాధానాల్లోని లూప్‌హోల్స్ దృష్ట్యా మరింత లోతైన దర్యాప్తు అవసరమని పోలీసులు కోర్టులో వాదించనున్నట్టు తెలిసింది. రవిపై ఇప్పటికే రెండుసార్లు విచారణ జరిగినప్పటికీ, అతను చెప్పిన కొన్ని విషయాలు తాజాగా బయటపడిన వివరాలతో అసలు సరిపోవడం లేదని అధికారులు భావిస్తున్నారు. పైరసీ నెట్‌వర్క్‌ను ఏ విధంగా నడిపాడు? ఎంతమంది మధ్యవర్తుల ద్వారా డబ్బులు చలామణి అయ్యాయి? వేరే దేశాల్లో ఉన్న సర్వర్లతో సంబంధం ఉందా? ఈ విషయాలన్నింటికి పూర్తి క్లారిటీ రావాలంటే మరోసారి కస్టడీ తప్పదని పోలీసులు అంటున్నారు. సైబర్ క్రైమ్ అధికారులు విచారణలో ఒక ఇన్‌ట్రెస్టింగ్ ప్రశ్న వేసినట్టు సమాచారం.. "సైబర్ క్రైమ్ విభాగంలో మంచి శాలరీతో ఉద్యోగం చేస్తావా?" అని పోలీసులు రవిని అడిగారు.. దీనికి రవి ఒప్పుకోలేదు. అతను జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కరేబీయన్ దీవుల్లో రెస్టారెంట్ పెట్టాలని ప్లాన్ చేస్తున్నట్టు చెప్పినట్లు తెలుస్తోంది.. ఇకపై నేరాలకు, పైరసీకీ దూరంగా సక్రమ మార్గంలో జీవించాలని అనుకుంటున్నట్టు తెలిపాడని పేర్కొంటున్నారు.. రెస్టారెంట్ కు ఏం పేరు పెడతావని.. ప్రశ్నించగా.. ఐబొమ్మ పేరు పెడతానని సమాధానం ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. "తప్పు చేశానని ఒప్పుకున్నాను.. ఇకపై ఎన్నడూ పైరసీ చేయను" అని రవి కొంత సాఫ్ట్ మోడ్‌లో సమాధానమిచ్చినట్టు సమాచారం..రవిని వివిధ కోణాల్లో పరీక్షించేందుకు మూడోసారి కస్టడీ అవసరం అని పోలీసులు భావించారు పైరసీ నెట్‌వర్క్‌లో ఇంకా బయటకు రాని వ్యక్తులు ఉన్నారు. రవి ఇచ్చిన డేటాను క్రాస్ చెక్ చేయడానికి మరోసారి అతని విచారణ అవసరమని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా అనుమానాస్పద ట్రాన్సాక్షన్లు, అంతర్జాతీయ లింకులు, ఎఖఔ నెట్‌వర్క్‌లో సాగిన కమ్యూనికేషన్ .. ఇవన్నీ రవిని ఎదిరించి అడగాల్సిన ప్రశ్నలే అని తెలుస్తోంది.మరోవైపు రవి తరఫు న్యాయవాదులు పూర్తిగా వేరే కోణంలో వాదిస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు విచారణ జరిగిందని, అప్పటికే పోలీసులు తమకు కావలసిన సమాచారాన్ని తీసుకున్నారని, ఇక మళ్లీ కస్టడీ అవసరం లేదని వాదిస్తున్నారు. రవికి నిర్దోషిత్వ అవకాశాలు ఉన్నాయని, మరింతగా కస్టడీ ఇవ్వడం చట్టవిరుద్ధమని వాదన సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రవి బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు కాసేపట్లో తీర్పు చెప్పబోతోంది. బెయిల్ రాకపోతే పోలీసులు కోరిన మూడో విడత కస్టడీకి మార్గం సుగమం అవుతుంది. బెయిల్ మంజూరు అయితే పరిస్థితి పూర్తిగా మారిపోతుందని పేర్కొంటున్నారు.

# వివాదంలో పొంగులేటి కుమారుడు

హైదరాబాద్, డిసెంబర్ 4, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు హర్షా రెడ్డి మీద వట్టినగులపల్లిలో భూమి ఆక్రమణ దౌర్జన్యంలో హత్యాయత్న కేసు నమోదు అయినా ఎఫ్ఐఆర్ మార్చేశారని భారత రాష్ట్ర సమితి నేతలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో మంత్రి కుమారుడు 70 మంది బౌన్సర్లు బృందంతో మూడు ఎకరాల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న వారిపై దాడి చేసి, హద్దుల గోడలు కూల్చి వేశారు. పశువుల షెడ్‌ను ధ్వంసం చేశారు. పొంగులేటి కుటుంబానికి చెందిన కంపెనీ వట్టి నాగులపల్లిలో ఓ ప్రాజెక్ట్ చేపట్టింది. ఆ ప్రాజెక్టు పక్కనే ఈ భూమి ఉన్నట్లుగా తెలుస్తోంది. దాడి చేసినవారు మాఫియా గ్యాంగ్‌లా ప్రవర్తించి, భూమి హద్దుల గోడలు కూల్చి, ఆవుల షెడ్‌ను ధ్వంసం చేశారని ప్రత్యక్ష సాక్షులు పోలీసులుకు చెప్పినట్లుగా తెలుస్తోంది. సెక్యూరిటీ గార్డులపై దాడి చేసి, వారిని తీవ్రంగా గాయపరిచారు. భయభ్రాంతులైన భూమి యజమానులు సైబరాబాద్ పోలీస్ అధికారికి ఫిర్యాదు చేశారని ఓ యువ పోలీస్ అధికారి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కేసు పెట్టారని బీఆర్ఎస్ నేతలంటున్నారు. అధికారి 120 మంది పోలీసులతో స్థలానికి చేరుకుని, బౌన్సర్ల బృందాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. మంత్రి కుమారుడు , కుటుంబ సభ్యులు ఘటన సమయంలో అక్కడే ఉన్నారని, వారిని కూడా అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపారు. అయితే వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పలుకుబడితో ఆ అధికారిని బదిలీ చేయించారని చెబుతున్నారు. చివరికి, హైదరాబాద్ పోలీసులు రెండు వైపులా కేసులు నమోదు చేశారు, కానీ ప్రధాన ఆరోపణలు అయిన హత్యాయత్నం, భూమి ఆక్రమణ పేర్కొనకుండా చిన్న కేసులుగా మార్చారని అంటున్నారు. ఈ ఆరోపణలపై పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైపు నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడిపై గతంలోనూ ఈడీ కేసులు ఉన్నాయి. అత్యంత ఖరీదైన వాచ్‌లను ఆయన స్మగ్లింగ్ ద్వారా తెప్పించుకున్నారని చెన్నాలోని కస్టమ్స్ శాఖ అధికారులుకేసులు పెట్టారు. ఈడీ కూడా కేసులు నమోదు చేసింది. పలుమార్లు విచారణకు రావాలని నోటీసులు జారీ చేసింది. అయితే ఆయన హాజరయ్యారో లేదో మాత్రం స్పష్టత లేదు.

# అమర జవాన్లకు నివాళులు

విశాఖపట్నం పాకిస్తాన్తో జరిగిన యుద్ధంలో ఘన విజయం సాధించి, అమర వీరులైన జవాన్లకు తూర్పు నౌకా దళం అధికారులు ఘన నివాళులు అర్పించారు.విశాఖ ఆర్ కే బీచ్లో అమర వీరుల స్మృతి చిహ్నం వద్ద కు తూర్పు నౌకాదళం అధికారు లు పుష్పమాలలతో రాగా 50 మంది నేవీ సిబ్బంది గౌరవ వందనం సమ ర్పించారు. ఈ కార్యక్రమంలో కలె క్టర్ , పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ సృజన, నేవీ అధికారు లు పాల్గొన్నారు.

# చంపేస్తున్న చలి...

అదిలాబాద్, డిసెంబర్ 4, చలి తీవ్రత అధికం కావడంతో దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత ఊహించిన దాని కంటే అధికంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు.తెలంగాణ, ఉత్తర కర్ణాటకతో పాటు మధ్య, వాయవ్య, పశ్చిమ, తూర్పు భారతంలోని పలు ప్రాంతాల్లో రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనుంది. ఈ నెల నుంచి ఫిబ్రవరి వరకు ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయన్న వివరాలపై భారత వాతావరణ శాఖ ఐఎండీ ఓ రిపోర్టు రిలీజ్ చేసింది. ఆయా ప్రాంతాల్లో పగలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా రికార్డు అవుతాయని చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో పగటితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంత కంటే అధికంగా రికార్డు అవుతాయని పేర్కొంది. ఈ నెల దక్షిణాదిన సాధారణం లేదా అంతకంటే అధికంగా వర్షపాతం రికార్డు అవుతుందని చెప్పింది.ఉత్తర కోస్తాలో సాధారణం కంటే అధికంగా, ఏపీలోని మిగతా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం రికార్డు అవుతుందని తెలిపింది. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇప్పటికే వాతావరణం చల్లబడింది. దానితో పాటు లా నినా ప్రభావంతో చలి గాలులు పెరుగుతాయని ఐఎండీ చెప్పింది. చలి పెరగడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు గుడిసెల్లో నివసించే సంచార జాతుల వారు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది.

# 40,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

హైదరాబాద్, డిసెంబర్ 4, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో తాము అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 60,000 ఉద్యోగాలు ఇచ్చామని, ప్రజాపాలన రెండున్నరేళ్ల పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని అన్నారు.

త్వరలోనే మరో 40,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. మరోవైపు, వైద్యారోగ్యశాఖలో 7,267 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని కాంగ్రెస్ సర్కారు చెప్పింది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఈ శాఖలో 9,203 పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైద్యరంగంలో సాధించిన ప్రగతిపై సర్కారు విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలు తెలిపింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించింది. ఇందులో కొత్తగా 163 రకాల చికిత్సలను చేర్చినట్లు వివరించింది. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్యను పెంచుతున్నామని చెప్పింది.తెలంగాణలో కొత్తగా 9 ప్రభుత్వ వైద్య కాలేజీలను ఏర్పాటు చేశామని, దీంతో అదనంగా 450 ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయని పేర్కొంది. 16 కొత్త నర్సింగ్ కళాశాలల వల్ల తెలంగాణలో వాటి సంఖ్య 37కు చేరిందని చెప్పింది. రెండేళ్లలో 28 పారామెడికల్ కళాశాలలను సర్కారు ప్రారంభించినట్లు తెలిపింది.

త్వరలో ఈ పోస్టుల భర్తీ
1,623 స్పెషలిస్టు డాక్టర్లు
607 అసిస్టెంట్ ప్రొఫెసర్లు
48 డెంటల్ డాక్టర్లు
2,322 స్టాఫ్‌నర్స్‌లు
732 ఫార్మసిస్టులు
1,931 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మహిళ)
నాలుగు స్పీచ్ పాథాలజిస్టు

# వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే పదవి ఖాయం

హైదరాబాద్, డిసెంబర్ 4, డీసీసీల నియామకం అయిపోయింది. పార్టీ పదవులు ఒక్కొక్కటిగా భర్తీ అయిపోతున్నాయ్. ఇక పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు మాత్రమే మిగిలాయి. హెవీ కాంపిటీషన్ ఉండటంతో..వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాన్ని ఇన్నాళ్లు హోల్డ్ లో పెట్టారు. ఆల్ ఆఫ్ సడెన్ గా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన హింట్ తో రేసు మొదలైందట. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం లాబీయింగ్ స్టార్ట్ చేశారట లీడర్లు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేసులో ఉన్నదెవరు? ఛాన్స్ దక్కె నేతలెవరు?తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి పదవుల పందేరం మొదలైంది. వరుసగా ఒక్కొక్కటిగా పార్టీ పదవులను భర్తీ చేస్తూ వస్తోంది ఏఐసీసీ. ఈ మధ్య కాలంలో వైస్ ప్రెసిడెంట్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ, పొలిటికల్ అడ్వైజరీ కమిటీ, జనరల్ సెక్రటరీలు..లేటెస్ట్ గా డీసీసీ డీసీసీ ప్రెసిడెంట్లను నియమించారు. ఇక ఫైనల్ గా మిగిలింది ఒక్క వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు మాత్రమే. ఈ కీలకమైన పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉంది. కీలకమైన నేతల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో ఇన్నాళ్లు హోల్డ్ లో పెట్టారు. అయితే గాంధీభవన్ లో జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులను కూడా భర్తీ చేస్తామని చెప్పారు. దీంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం నేతలు మరోసారి లాబీయింగ్ స్టార్ట్ చేశారట.కాంగ్రెస్ పార్టీలో పీసీసీ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు అత్యంత కీలకమైనది. ఈ పోస్టులో గతంలో పని చేసిన వారందరూ ఇప్పుడు కీలకమైన పోస్టులో ఉన్నారు. ప్రస్తుతం సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి కూడా కాంగ్రెస్ లోకి రాగానే వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేసిన వారే. ప్రస్తుతం పీసీసీ చీఫ్ గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ కూడా లాస్ట్ టర్మ్ లో వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేశారు. ఇలా వర్కింగ్ ప్రెసిడెంట్ గా కీలకమైన నేతలే పని చేయడంతో ఇప్పుడు ఈ పోస్ట్ కు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఈ సారి వర్కింగ్ ప్రెసిడెంట్లను సామాజిక వర్గాల వారీగా కీలకమైన వ్యక్తులకు ఛాన్స్ ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోంది.వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం సామాజికవర్గాల వారీగా ఈసారి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోందట. ఒక్కో సామాజిక వర్గం నుంచి ఒక్కరికి ఛాన్స్ ఉండటంతో..పోటీలో మాత్రం చాలా మంది క్యూలో ఉన్నారట. రెడ్డి సామాజికవర్గం నుంచి పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితులు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రోహిన్ రెడ్డితో పాటు వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా రేసులో ఉన్నారట.నాయిని రాజేందర్ రెడ్డికి వైస్ ప్రెసిడెంట్ గా అవకాశం ఇచ్చినా..ఆయన ఆ పోస్టును తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఇక ఎంపీ చామల అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఫైనల్ గా రోహిన్ రెడ్డికి అవకాశం ఇస్తారని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక బీసీ సామాజికవర్గం నుంచి టీఎస్ఎండీసీ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం ప్రయత్నిస్తున్నారట.ఎస్సీ సామాజికవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ లాబీయింగ్ చేస్తున్నారట. ఎస్టీ సామాజికవర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ రేసులో ఉన్నారని అంటున్నారు.

ఎంపీ బలరాం నాయక్ పీసీసీ చీఫ్ పోస్ట్ కోసం ప్రయత్నాలు చేసినా..వర్క్ ఔట్ కాలేదని..దాంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట. ఇక ఫైనల్ గా మైనారిటీ కోటాలో ఫిరోజ్ ఖాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఖమ్మం మాజీ డీసీసీ అధ్యక్షుడు జావిద్ రేసులో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ కీలకమైన పోస్టు ఎవరెవరికి దక్కుతుందనేది చూడాలి.

# టీసీయూఆర్‌గా గ్రేటర్ హైదరాబాద్

హైదరాబాద్, డిసెంబర్ 4, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అనే పేరు ఇక చరిత్రలో కలిసిపోయే అవకాశాలు ఉన్నాయి. ఆరు జోన్లు, 30 సర్కిళ్లతో ఉన్న జీహెచ్ఎంసీ త్వరలోనే తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా మారనున్నట్లు తెలుస్తోంది.దీనిపై సమగ్ర ప్రణాళిక త్వరలో వెలుపడే అవకాశముంది. అలాగే, టీసీయూఆర్ పరిధిలోని ప్రాంతాన్ని మూడు విభాగాలు విభజించే ప్రతిపాదన ఉంది. అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. (ఉఊఓఅ)ఢిల్లీలో ఇలాగే ఎన్సీఆర్ (నేషనల్ కేపిటల్ రీజియన్) ఉన్న విషయం తెలిసిందే. ఆ తరహాలోనే హైదరాబాద్‌లో టీసీయూఆర్ అధికారికంగా మారనుంది. జీహెచ్ఎంసీలో 27 మునిసిపల్ బాడీలను విలీనం చేసి, జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించే క్రమంలో అతి పెద్ద మహానగరంగా మారనుంది హైదరాబాద్.తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా పేరు మార్పునకు మార్గం సుగమం చేసింది. ప్రభుత్వం మూడు ఆర్డినెన్సులను జారీ చేసి, అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో మునిసిపల్ చట్టంలో మార్పులు చేయనున్నట్లు సమాచారం. టీసీయూఆర్ హైదరాబాద్‌కు చట్టబద్ధత కల్పిస్తారు. దీంతో అధికారికంగా విలీన ప్రక్రియ పూర్తికానుంది.

# జిల్లా ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ఇంటిపై ఏసీబీ దాడి

రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్ ఆస్తులపై ఏసీబీ సోదాలు జరిపింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో శ్రీనివాస్ ఇండ్లలో సోదాలు జరిగాయి. హైదరాబాద్ , రంగారెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలో సోదాలు కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఆరు చోట్ల ఏసీబీ అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. ల్యాండ్ రికార్డ్స్ ఈడిగా పెద్ద ఎత్తున అక్రమాస్తులు సంపాదించినట్లు గుర్తించారు. మహబూబ్ నగర్ లో ఒక రైస్ మిల్లును కూడా గుర్తించారు. పలుచోట్ల షెల్ కంపెనీల పేరుతో వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం తో పాటు రాయ్ దుర్గంలో మై హోం భుజ లో సోదాలు చేస్తున్నారు.

# రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్ల హ్యాక్..




**హైదరాబాద్ డిసెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గద పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు.సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఫైర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపులు చెబుతున్నారు.

# నేడు ప్రపంచ మృత్తిక (నేల)దినోత్సవం

మానవాళి మనుగడలో 'నేల' పాత్ర అత్యంత కీలకం. మనుషులు, పశు పక్ష్యాదుల జీవనానికి అవసరమైన ఆహారాన్ని ఇది అందిస్తుంది. సారవంతమైన నేలలు అధిక ఆహార ఉత్పత్తులకు దోహదపడతాయి. కానీ, వివిధ కారణాల వల్ల నేలలు నిస్సారమవుతున్నాయి. రోజురోజుకూ అవి కోతలకు గురవుతున్నాయి. ఇది అనేక అనర్థాలకు దారితీస్తోంది. ఈ పరిస్థితుల్లో నేలలను సంరక్షించాల్సిన ఆవశ్యకతను గుర్తించిన ఐక్యరాజ్య సమితి 2013 నుంచి ఏటా డిసెంబరు అయిదున ప్రపంచ నేలల (మృత్తిక) దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం 'నేల కోతను అరికట్టి భూమి మీద జీవరాశిని కాపాడుదాం' అనే నినాదంతో ముందుకు సాగనుంది. 'ప్రపంచవ్యాప్తంగా నేల కోత దుష్ప్రభావాలు ఇటీవలి కాలంలో ప్రపంచ ఆర్థిక మాంద్యానికి కారణమవుతూ మానవాళి పురోగతికి ప్రతిబంధకంగా మారాయి. ఆయా దేశాల ప్రభుత్వాలు నేలకోతను అరికట్టే చర్యలను ప్రణాళికాబద్ధంగా, అత్యంత జాగరూకతతో అమలు చెయ్యాల్సిన సమయం ఆసన్నమైంది.

# పోలీసుల అదుపులో మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్ స్టర్ !



నిందితుడు అలెక్స్

చిత్తూరు పేరు మోసిన రౌడి అలెక్స్ ను గుడిపాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యలు దొంగతనాలు దోపిడీలు గ్యాంగ్ రేప్ లు అతడి వృత్తి. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై కి చెందిన అలెక్స్ వేలూరులో నివాసం వుంటున్నాడు. ఇతను వెల్లూరు జిల్లాలో పేరు మోసిన రౌడీ షీటర్ అని సమాచారం . వేలూరు పరిసర ప్రాంతాలలోని విద్యార్థులను గంజాయి మత్తుకు బానిసలను చేసి మచ్చిక చేసుకోవడం, గిరిజన ప్రాంతాలలోని యువతులను టార్గెట్ చేసి రేప్ చేసి పారిపోవడమే అతడి ప్రవృత్తి. గతవారం ఓ యువతపై రేప్ చేసి పారిపోతుండగా గ్రామస్తులు అడ్డోచ్చారు. గ్రామస్తులను కత్తులతో బెదిరించి ఓ యువకుడు అడ్డుపడగా అతడిని గాయపరిచారు. యువతి ఫిర్యాదుతో గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసారు. చిత్తపార గ్రామానికి చెందిన మల్లేష్ సహకారంతో వలపన్ని గుడిపాల పోలీసుల బృందం పట్టుకుంది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రల లో అలెక్స్ పై 50 కేసులు పైగా ఉన్నట్లు సమాచారం. నెలవారి వసూలు లక్షల్లో కోట్లలో లావాదేవీలు జరుపుతాడు. అలెక్స్ ను బెయిలుపై విడిపించడానికి అధిక సంఖ్యలో లాయర్లు తయారుగా వున్నారు. విషయం తెలుసుకున్న తమిళనాడు సిఐడి, ఇంటెలిజెన్స్ పోలీసులు అలెక్స్ కోసం గుడిపాలకు వచ్చారు. నిందితుడిని లోతుగా విచారిస్తున్నారు.

# సర్పంచ్ అభ్యర్థి భర్త ఆత్మహత్య



నిర్మల్ జ ఖానాపూర్ మండలం సోమార్ పేట్ గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి (బీఆర్ఎస్ ) భర్త బండారి రవీందర్ (54) ఇంటి సమీపంలోని పాకలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# బీజాపూర్ ఎన్కౌంటర్ లో పెరుగుతున్న మృతుల సంఖ్య

చత్తీస్ ఘబడ్ బుధవారం బీజాపూర్ జిల్లా గంగలూరు పిఎస్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఘటనా స్థలం వద్ద ఇప్పటివరకు 16 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య 20 కి పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచరం. మృతుల్లో ఒకరు డీవీసీఎం క్యాడర్ కు చెందిన పిఎల్జీయే ప్లాటూన్ నెంబర్ 2 కమాండర్ వెల్లా మొడియం గా గుర్తించారు. ఘటనా స్థలం వద్ద ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, 303, ఎంఎంజీ మిషన్ గన్, మందు గుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు.




# వార్డు 4 లో 9 వ రోజు బస్తీ పర్యటించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ బస్తీల సమస్యలు తెలుసుకోవడానికి చేపట్టిన బస్తీల పర్యటనలో భాగంగా గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ వార్డు 4 లోని శ్రీనివాసులు గార్డెన్, రాజలింగం గార్డెన్, శ్రీరంగ గార్డెన్స్ లలో కంటోన్మెంట్, స్టేట్ గవర్నమెంట్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించి బస్తీల సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా బస్తీ వాసులకు డ్రైనేజీ పైపు లైన్లు పాడై పోవడంతో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా బోర్డుకు సమకూరిన 303 కోట్ల రూపాయల నుంచి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కంటోన్మెంట్ అధికారులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించడంతో అధికారులు అంగీకరించి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

బస్తీ వాసులకు అవసరమైన మెరుగైన మంచినీటి సరఫరా,కమ్యూనిటీ హాళ్ళు,నూతన బోర్ వెల్ ల పనులను త్వరలోనే పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో బస్తీల వాసులు ధన్యవాదాలు తెలపడంతో ఇది నా బాధ్యత అని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు.

ఈ బస్తీ పర్యటనలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ, ఆనంద్, సురేఖ, మహేష్, సాంబశివ,ధనశ్రీ, సంజీవరావు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు


# ఘంటసాల గేయాలు ఎప్పటికీ మరువలేనివి అడిషనల్ డిసిపి రాందాస్ తేజోవత్



**హైదరాబాద్ డిసెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:**:మాతృదేవోభవ సత్సంగ్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి లోని గంటసాల విలహానికి పూలమాల చేసి అర్పించారు ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి రాందాస్ తేజోవత్ మాట్లాడుతూ ఘంటసాల గేయాలు ఎప్పటికీ మరువలేనని ముఖ్యంగా ఘంటసాల గారి భగవద్గీత ప్రపంచానికే సందేశమని కొనియాడారు మరొక అతిథిగా గా వచ్చిన రైతుబంధు మదన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఘంటసాల స్ఫూర్తితో నేటి యువత మన సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలనుంచాలని తెలిపారు కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ శ్రీధర్ గౌరవ అతిథులు నాదెండ్ల సుధాకర్ డాక్టర్ పద్మిని వాసుదేవరావ్ ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు

## పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఉగ్రవాద గ్రూప్

### 'జమాతుల్-ముమినాత్' పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు



న్యూ డిల్లీ డిసెంబర్ 4 పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఓ ఉగ్రవాద గ్రూప్ ను తయారుచేస్తున్న విషయం తెలిసిందే. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. 'జమాతుల్-ముమినాత్' పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించినట్లు తేలింది. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ అజారే సోషల్ మీడియా వేదికగా వెల్లడించడం గమనార్హం.ఉగ్రవాద సంస్థ మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోందని జైష్ చీఫ్ మసూద్ అజార్ అందులో పేర్కొన్నారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 'జైషే మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోంది. చాలా తక్కువ సమయంలోనే 5,000 మందికిపైగా మహిళలు చేరారు. ఇదంతా అల్లా దయ వల్లే జరిగింది. చాలా మంది సోదరీమణులు నియామకం పొందిన వెంటనే తమ మానస్థిక స్థితిమారిపోయినట్లు చెబుతున్నారు. జీవిత లక్ష్యాన్ని గ్రహించినట్లు చెప్పారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాకు ఒక ముంటాజియా (మేనేజర్) ఉంటారు' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.కాగా, పలు నివేదికల ప్రకారం.. జమాతుల్-ముమినాత్ కోసం నియామక డ్రైవ్ ఈ ఏడాది అక్టోబర్ 8న జైషే ప్రధాన కార్యాలయం మర్కజ్ ఉస్మాన్-ఓ-అలీలో ప్రారంభమైంది. ఈ డ్రైవ్‌లో భాగంగా పాక్‌లోని బహవల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లి నుంచి మహిళలను ఉగ్రవాద సంస్థలోకి చేర్చుకున్నారు. ఈ సంస్థ రూ.500 ఫీజుతో 40 నిమిషాలు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తూ.. మహిళల్ని ఉగ్రవాదం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఐఎస్ఐఎస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహాలో ఫిదాయిన్ (ఆత్మాహుతి) దాడులు నిర్వహించడానికి ఈ మహిళలతో ఉగ్రవాద బ్రిగేడ్‌లను ఏర్పాటు చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

### గవర్నర్ కు డబ్ల్యూజేఐ వినతి

హైదరాబాద్, రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలనుబిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ గురువారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గారి దృష్టికి దృష్టికి తీసుకెళ్ళింది.యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నందనం కృపాకర్, అధ్యక్షుడు రాణా ప్రతాప్ (రజ్జు భయ్యా), ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాధుని ప్రమోద్ కుమార్, కప్పర ప్రసాద్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం గురువారం లోకభవన్ లోగవర్నర్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలోని జర్నలిస్టులకు సంబంధించి అక్రిడికేషన్ల జారి ప్రక్రియలో రెండేళ్లుగా జరుగుతున్న జాప్యాన్ని యూనియన్ ప్రతినిధి బృందం గవర్నర్ దృష్టికి తీసుకువచ్చింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 219కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లలో ఎలక్ట్రానిక్, డిజిటల్, వెబ్ మీడియాకు అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపింది. తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ పాలసీలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు డిజిటల్,వెబ్ జర్నలిస్టులకుఅవకాశం కల్పించాలని కోరింది.ఆరోగ్య బీమా అమలులో అంతులేని నిర్లక్ష్యం గ్రామీణ జర్నలిస్టులకు శాపంగా పరిణమించిందని యూనియన్ నేతలు గవర్నర్ ద్రుష్టికి తెచ్చారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం హెల్త్ కార్డులు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో జర్నలిస్టుల నివేశన స్థలాలసమస్యలు ఏళ్ళ తరబడి కొలిక్కి రాకపోవడం వల్ల జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరడం లేదన్నారు. ఈ విషయంలో సత్వర నిర్ణయంతీసుకునే విధంగా ప్రభుత్వానికి సూచన చేయాలని కోరారు.హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు మెట్రోలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.అదే విధంగా జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద జర్నలిస్టులకు రాయితీ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వెలువడుతున్న స్థానిక దినపత్రికల మనుగడ కోసం సమాచార శాఖ కార్యాలయంలో ఎన్ ప్యానల్ మెంట్ వేగవంతం చేయాలని, అర్హత గల పత్రికల ఎన్ ప్యానల్ మెంట్ పూర్తి చేస్తూ,పెరిగిన ధరలకు అనుగుణంగా వాటి రేట్ కార్డు పెంచాలని కోరారు.

## హుస్నాబాద్ లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్: ప్రెస్ మీట్



హుస్నాబాద్ సీఎం శంకుస్థాపన చేసిన పనులు ఆరు నెలల్లో పూర్తి చేసే దమ్ముందా,హుస్నాబాద్ లో సీఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు, గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని అడుగడుగునా అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ. పదేళ్లలో 96% రిజర్వాయర్ ను పూర్తి చేసి అందులో ఒకటి ఎం సి వరకు నీళ్లు నింపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే.కుర్చీ వేసుకుని గౌరవెల్లిని పూర్తి చేస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్న ఘనత కెసిఆర్ ది..రిజర్వాయర్ కాలువల భూసేకరణ, నిర్మాణానికి సంబంధించి కూడా టిఆర్ఎస్ ప్రభుత్వం రూ 200 కోట్లు కేటాయించిన విషయం మర్చిపోవద్దు. కాలువలకు రూ437 కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పుకోవడం తప్ప ఇప్పటివరకు కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేకపోయారు. రెండేళ్లలో మీరేం చేశారనేది ఆలోచించుకోండి.పిసిసి అధ్యక్షుడి హోదాలో ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా గండిపల్లిని సందర్శించి అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్లు గడిచిన గండిపల్లి ఊసు కూడా ఎత్తడం లేదు?2014 ముందు హుస్నాబాద్ పట్టణం ఎలా ఉండేది అనంతరం ఎలా మారింది అనేది ఇక్కడ ప్రజలందరికీ తెలుసు..ఇక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదనడం సీఎం, మంత్రి విజ్ఞతకే వదిలేస్తున్నా.ఎలాంటి అభివృద్ధి జరగందే హుస్నాబాద్ పట్టణానికి పలుమార్లు జాతీయ అవార్డులు వచ్చాయాహుస్నాబాద్ నియోజకవర్గం లో చిన్న నీటి వనరులను అభివృద్ధి చేసిన ఘనత మాకే దక్కుతుంది మహాసముద్రం గండి, గాడుదులలొద్ది నిర్మాణం చేసింది మేమే..శనిగరం ప్రాజెక్టు, చెరువులు కుంటల మరమ్మత్తులు ఎవరు చేశారు చెప్పాలి. ఇది అభివృద్ధి కిందికి రాదాకేవలం ఒక కళాశాలకు అనుమతులు తెచ్చి హుస్నాబాద్ కు ఎంతో చేశామని చెప్పడం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.కోట్ల రూపాయలు మంజూరు చేసామని చెప్పడం తప్ప పనులు పూర్తి చేసి చూపించిన దాఖలాలు ఎక్కడైనా కనిపించాయా.స్థానిక మంత్రిది మాటలు ఎక్కువ పనులు తక్కువ అనే చందంగా ఉన్నదిహుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు నిస్వార్ధంగా సేవలందించడంతోపాటు సాధ్యమైనంత అభివృద్ధి చేశాము తప్ప ఎన్నడు కూడా కమిషన్లకు కక్కుర్తి పడలేదు.దమ్ముంటే ఆరు నెలల్లో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన పనులన్నీ పూర్తి చేసి చూపించాలి అప్పుడు ప్రజలు నమ్ముతారు తప్ప ఇప్పుడు వచ్చి సభలు పెట్టి ఎన్ని ఊకదంపుడు ముచ్చట్లు చెప్పిన ఇక్కడి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.6 గ్యారంటీలను అమలు చేయలేక 420 హామీలను నెరవేర్చలేక గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడిపోతామని భయంతోనే ముఖ్యమంత్రి జిల్లా పర్యటన చేస్తూ బహిరంగ సభలు పెడుతున్నాడు.సర్పంచ్ ఎన్నికల్లో లబ్ధి కోసమే తప్ప సీఎం బహిరంగ సభలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు.కమిషన్ల కోసమే పక్కాగా ఉన్న దవాఖాన భవనాన్ని కూల్చివేశారు. చిత్తశుద్ధి ఉంటే కొత్త భవనాన్ని మరోచోట విశాలమైన స్థలంలో నిర్మించవచ్చు కదా.తొమ్మిదిన్నర ఏండ్ల టిఆర్ఎస్ పాలనలో రూ 5649 కోట్ల అభివృద్ధి రూ 3427 కోట్ల సంక్షేమాన్ని అందించిన ఘనతమాదే గౌరవెల్లి భూనిర్వాసితులను రెచ్చగొట్టి ఎకరాకు రూ.30 లక్షల పరిహారం ఇప్పిస్తామని చెప్పిన పొన్నం ప్రభాకర్ ఇప్పుడు కేవలం రూ.15 లక్షలు ఇస్తామనడం హాస్యాస్మంతంగా ఉందన్నారు.స్థానిక మంత్రి ఉన్నం ప్రభాకర్ ఇప్పటికైనా తన తీరును మార్చుకోవాలని కేవలం సంపాదన ధ్యేయంగా పనిచేయకుండా సేవా దృక్పథంతో ప్రజలకు సేవలందించాలని హితవు పలికారు.

## సినిమాల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పి విద్యార్థినిపై కో డైరెక్టర్, కెమెరామెన్ లైంగిక దాడి



**హైదరాబాద్ డిసెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** సినిమాల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పి తొమ్మిదవ తరగతి విద్యార్థినిపై కో డైరెక్టర్, కెమెరామెన్ లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన హైదరాబాద్ ల్ లోని ఫిలింనగర్ లో జరిగింది. కో డైరెక్టర్, కెమెరామెన్, వారికి సహకరించిన బాలిక పెద్దమ్మను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఓ బాలిక (13) తొమ్మిదో తరగతి చదువుతూ తన పెద్దమ్మ ఇంట్లో ఉంటుంది. బాలిక పెద్దమ్మకు పరిచయమైన కడప జిల్లాకు చెందిన సినిమా కో డైరెక్టర్ బండి వెంకట శివారెడ్డి, కెమెరామెన్ పెనికెలపాటి అనిల్ ఆమె ఇంటికి తరచూ వస్తున్నారు. బాలికపై ఇద్దరు కన్నేసి సినిమాలు అవకాశాలు ఇప్పిస్తామని ఆశ కల్పించారు. ఇదే విషయాన్ని వారు బాలిక పెద్దమ్మకు తెలపగా, వారిద్దరికి సినీ పరిశ్రమలో మంచి పలుకుబడి ఉందని వారితో చనువుగా ఉంటే మంచి అవకాశాలు వస్తాయని బాలికను ఇద్దరు నమ్మించారు. పెద్దమ్మ మాటలు విని వారితో మాట్లాడుతున్న సమయంలో పలుమార్లు బాలికపై నిందితులు లైంగిక దాడికి పాల్పడ్డారు. జరిగిన విషయాన్ని బాలిక తన పాఠశాల ఉపాధ్యాయురాలికి తెలిపింది. ఉపాధ్యాయురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వెంకట శివారెడ్డి, పెనికెలపాటి అనిల్ పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

## సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాల రద్దు



న్యూ డిల్లీ డిసెంబర్ 4 దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతున్నది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. నవంబర్‌లో ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ బుధవారం ప్రకటించింది. అంతేకాదు, కేవలం గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ సహా ఇతర పట్టణాలకు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో సంక్షోభం తలెత్తింది.సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే ఏకంగా 250 నుంచి 300 విమానాలను సంస్థ రద్దు చేసింది. ఈ కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో సంక్షోభం ఏర్పడింది. ఫ్లైట్స్ రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయి దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఎయిర్‌పోర్ట్స్ వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. విమానాలు రద్దు కావడంతో ప్రముఖ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరింది.అదే సమయంలో తాజా పరిస్థితిపై ప్రయాణికులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ట్యాగ్ చేస్తూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 7 గంటలకు పైగా చిక్కుకుపోయిన ఓ ప్రయాణికుడు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర గందరగోళం తలెత్తినట్లు ఎక్స్‌లో పేర్కొన్నాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు 12 గంటలకు పైగా ఎటువంటి కన్ఫర్మేషన్ లేకుండా పడిగాపులు పడుతున్నారని, ఇండిగో సిబ్బంది అబద్ధాలు చెబుతూ జలగల్లా పీడిస్తున్నారని విమర్శించారు.

48 గంటల్లో సాధారణ స్థితికి..

మరోవైపు విమానాల రద్దు, ఆలస్యంపై ఇండిగో సంస్థ స్పందించింది. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపింది. క్రమంగా తమ విమానాలు పునరుద్ధరించనున్నామని వెల్లడించింది. విమానాల రద్దు కారణంగా ప్రభావితమైన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. 48 గంటల్లో తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని తెలిపింది. ఈ మేరకు గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసింది.

ఇండిగో విమానాల రద్దుపై దర్యాప్తు: డీజీసీఏ

ఇండిగో ఎయిర్‌లైన్స్ పనితీరును డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) బుధవారం ప్రశ్నించింది. నవంబర్‌లో 1,232 విమానాలు రద్దవడంతోపాటు విమానాల రాకపోకల సమయాల్లో జాప్యం జరిగింది. ఈ పరిస్థితిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీసీఏ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి ఇండిగోతో కలిసి మదింపు చేస్తున్నట్లు తెలిపింది.

## అంతర్రాష్ట్ర బస్సులో పట్టుబడిన రూ.72 లక్షల నగదు.. ఇద్దరు అరెస్టు



కేరళ, డిసెంబర్ 04: కొట్టాయంలో అంతర్రాష్ట్ర బస్సులో లెక్కల్లో చూపని సుమారు రూ.72 లక్షల నగదును ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ, కేరళ మధ్య నడిచే అంతరాష్ట్ర బస్సులో ఈ డబ్బును గుర్తించారు. వీటిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం పండుగలు సహా కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మాదకద్రవ్యాలు, నల్లధనం అక్రమ రవాణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. కొట్టాయంలోని కురవిలంగాడ్‌లో జరిగిన తనిఖీల్లో అధికారులు బస్సులోని ఒక బ్యాగ్‌లో దాచిన నగదు కట్టలను కనుగొన్నారు. మరింత అనుమానం రావడంతో ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా.. వారి వద్ద మరింత నగదు ఉన్నట్లు గుర్తించారు.స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.72లక్షలు ఉందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ఏపీకి చెందిన షేక్ జాఫర్, షాషాస్‌గా గుర్తించారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలను ఇద్దరూ సమర్పించలేకపోయారు. ఇద్దరు అనుమానితులను తదుపరి దర్యాప్తు కోసం ఆదాయపు పన్ను శాఖకు అప్పగించారు. భారీగా పట్టుబడిన ఈ నగదు వెనుక హవాలా రాకెట్ ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల ఫోన్లను కూడా జప్తు చేశారు.

# బీసీ బిల్లుల పెండింగ్ పై సీఎం ఢిల్లీ పర్యటనలో ప్రధానితో ఎందుకు మాట్లాడలేదు.

## బీసీలపై కాంగ్రెస్ ది కపట ప్రేమ.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దేశ రాజధాని ఢిల్లీలో డిసెంబర్ 1వ తేదీ నుంచి శీతాకాల పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 14 బిల్లులలో తెలంగాణ రాష్ట్రం నుండి మార్చి 17వ తేదీన ఉభయ సభల్లో ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదంపై కేంద్రానికి పంపించిన రెండు రిజర్వేషన్లు బీసీ బిల్లులు (బిల్లు నెంబర్ 3, బిల్లు నెంబర్ 4) గత 8 నెలల నుండి పెండింగ్లోనే ఉన్నాయని, నేటి సమావేశాల్లో వాటిని చర్చకు ప్రవేశపెట్టకపోవడం దుర్మార్గమైన చర్య అని అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ తీవ్రంగా మండిపడ్డారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన చేసిన రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోడీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లతో భేటీ అయినప్పుడు పెండింగ్లో ఉన్న బీసీ బిల్లుల గురించి చర్చించకపోవడంలో ఆంతర్యం ఏమిటని నరేందర్ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై మాట ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో వ్యవహరించి, అఖిలపక్షంతో, బీసీ జేఏసీ నేతలతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని, పార్లమెంటును స్తంభింపజేసి, ఢిల్లీని దిగ్బంధించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ బందులో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగుల జీతాలు కట్ చేయడంపై ఆగ్రహం.

బీసీలకు స్థానిక ఎన్నికలలో, విద్య, ఉపాధి, ఉద్యోగాలలో 42% రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ నవంబర్ 18వ తేదీన జరిగిన బీసీ బందులో పాల్గొన్న సుమారు 700 మంది ఆర్టీసీ ఉద్యోగుల జీతాల ను కట్ చేయడం పట్ల పొలాస నరేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బీసీ రిజర్వేషన్ల అమలుపట్ల ప్రభుత్వానికి ఎంత చిత్త శుద్ధి ఉందో తెలుపుతుందని, బీసీ వర్గాలకు ఈ చర్య అర్థమవుతుందని అన్నారు. బీసీ సంఘాలు చేపట్టిన బంధుకు మద్దతు తెలిపిన ప్రభుత్వ, నిరసనలో పాల్గొన్న ఉద్యోగులను వేధింపులకు గురి చేయడం సరికాదని, బీసీ సాధికారిత సంఘం దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిలుపుదల చేసిన జీతాలను వెంటనే చెల్లించాలని, లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన తప్పదని పొలాస నరేందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# భూగర్భ గనుల నుంచి విషపూరిత వాయువు లీక్

## ఇద్దరు మహిళలు మృతి .. పలువురు అస్వస్థత



రాంచీ డిసెంబర్ 4 : భూగర్భ గనుల నుంచి విషపూరిత వాయువు లీక్ అయ్యింది. ఇద్దరు మహిళలు మరణించగా పలువురు అస్వస్థతకు గురయ్యారు. వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విష వాయువు లీక్ వల్ల ఆ ప్రాంతంలోని ప్రజలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జార?ండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్)కు చెందిన భూగర్భ గని నుంచి విష వాయువైన కార్బన్ మోనాక్సైడ్ లీక్ అయ్యింది. కాగా, కెందువాడి బస్తీలో పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరు మహిళలు మరణించినట్లు తెలుస్తున్నది. దీంతో ధన్‌బాద్–రాంచీ రహదారిని ఆ ప్రాంతవాసులు దిగ్బంధించారు. రోడ్డుపై టైర్లు కాల్చి నిరసన తెలిపారు. మరోవైపు భూగర్భ గని నుంచి విష వాయువు కార్బన్ మోనాక్సైడ్ లీక్ కావడంపై బీసీసీఎల్ కంపెనీ స్పందించింది. అత్యవసర పరిస్థితిని ఎదుర్కోనేందుకు మూడు అంబులెన్స్‌లను అక్కడ సిద్ధంగా ఉంచింది. ఆ ప్రాంతవాసులు అక్కడి నుంచి ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని సూచించింది. సమారు వెయ్యి మందికిపైగా ప్రజలు వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని కోరుతూ వారి ఇళ్ల గోడలకు ఆ కంపెనీ నోటీసులు అంటించింది. నివాసితులను సురక్షితమైన ప్రదేశాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ ఏరియా మేనేజర్ తెలిపారు.

# మంత్రి అజారుద్దీన్ కు పిసిసి మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ రఫీయా బేగం అభినందనలు



**ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ డిసెంబర్ 4 రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్ ను పిసిసి మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ రఫీయా బేగం సచివాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. సందర్భంగా జూబ్లి హిల్స్ ఎన్నికల్లో విశేషంగా కృషిచేసి నవీన్ యాదవ్ గెలుపుకు కృషి చేసిన రఫీయా బేగం ను మంత్రి అభినందించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు నామినేటెడ్ పదవుల్లో రఫీయా బేగం కు అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ హామీ ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని రఫీయా బేగం మంత్రి కి హామీ ఇచ్చారు

# బి ఆర్ ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీలో చేరిక

## వందమంది కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీలో చేరిక

## పార్టీలో చేరిన కార్యకర్తలను స్వాగతించిన మంత్రి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 04 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సమక్షం లో కాంగ్రెస్ పార్టీ లో చేరిన మునిపల్లి మండలం గార్లపల్లి, గ్రామ (బి ఆర్ ఎస్) పార్టీ అధ్యక్షులు ఈశ్వరప్ప , మాజీ సర్పంచ్ నాగేందర్ పటేల్,గార్ల అద్వర్యం లో సుమారు 100,మంది కార్యకర్తలు హస్తం గూటికి చేరారు, అందోల్ నియోజకవర్గం లో మంత్రి దామోదర్ రాజనర్సింహా, మునిపల్లి, మండలం లో ఏంతో ప్రతిష్టాత్మకంగా సింగూర్, బ్యాక్ వాటర్ పైన ఆరు గ్రామాలను కలుపుతూ 18, కోట్ల రూపాయలతో గార్లపల్లి – తక్కడపల్లి, గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం తో పాటు , 42,కోట్ల రూపాయల తో నిర్మిస్తున్న తాటి పల్లి – ముక్తకేశారం,ల మధ్య నిర్మిస్తున్న డబుల్ రోడ్డు , 70 కోట్ల రూపాయల తో నిర్మిస్తున్న సింగితం – కోడూరు,రోడ్డు బుదేరా – సిరూర్,గ్రామాల మధ్య నిర్మిస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులు , అభివృద్ధి, సంక్షేమానికి,కృషి చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ లో చేరినట్లు తెలిపారు,ఈ కార్యక్రమము లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్ కుమార్ , కాంగ్రెస్ పార్టీ లో చేరిన ముఖ్య కార్యకర్తలు సుధాకర్ ,మాణయ్య , అమరనాథ్ ,చిన్న సిద్దన్న ,శంకరయ్య , సంగమేశ్వర్ ,మాణయ్య , ఇమామ్ సాబ్ లు పాల్గోన్నారు .



# యాసిడ్ దాడి కేసులపై సుప్రీంకోర్టు షాక్

## దేశ్యాప్తంగా యాసిడ్ దాడి కేసుల పెండింగ్ వివరాలను వెల్లడించాలని అన్ని హైకోర్టులకు ఆదేశం



న్యూఢిల్లీ డిసెంబర్ 4 : యాసిడ్ దాడి కేసులపై సుప్రీంకోర్టు షాక్ వ్యక్తం చేసింది. దేశ్యాప్తంగా యాసిడ్ దాడి కేసుల పెండింగ్ వివరాలను వెల్లడించాలని అన్ని హైకోర్టులకు సుప్రీంకోర్టు ఇవాళ ఆదేశం జారీ చేసింది. నాలుగు వారాల్లోగా ఆ సమాచారాన్ని ఇవ్వాలని చెప్పింది. ఢిల్లీలో రోహిణి కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఓ యాసిడ్ దాడి కేసును సుప్రీం విచారిస్తూ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 16 ఏళ్లుగా యాసిడ్ దాడి కేసులో విచారణ జరగడం సిగ్గుచేటు అని ధర్మాసనం చెప్పింది. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయమాలా బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీం ధర్మాసనం తన షాక్‌ను వ్యక్తం చేసింది. షాహీన్ మాలిక్ కేసులో సుప్రీం స్పందిస్తూ.. 2009 నుంచి ఆ కేసు రోహిణి కోర్టులో ఉందని, ఇది న్యాయ వ్యవస్థను పరిహాసం చేయడమే అవుతుందని ధర్మాసనం చెప్పింది. ఇది చాలా సిగ్గుచేటు అంశమని, దేశ రాజధానిలో ఓ కేసు ఇంత కాలం పెండింగ్‌లో ఉంటే, మరి ఎవరు దీన్ని పరిష్కరిస్తారని, ఇది నిజంగా దేశానికే సిగ్గుచేటు అని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ప్రభుత్వ పథకాలను పొందేందుకు యాసిడ్ బాధితులను దివ్యాంగులుగా గుర్తించాలని మాలిక్ చేసిన అభ్యర్థనను కేంద్రం పరిశీలించాలని సుప్రీం ధర్మాసనం చెప్పింది. అయితే ఈ అంశాన్ని సీరియస్‌గా పరిశీలించనున్నట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దివ్యాంగుల క్యాటగిరీలో యాసిడ్ దాడి బాధితుల్ని చేర్చేందుకు చట్టాన్ని సవరించాలని కేంద్రాన్ని సీజేఐ కోరారు.

# రోశయ్య సేవలు మరువలేనివి

## ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె బీ శ్రీధర్



**హైదరాబాద్ డిసెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** ఎమ్మెల్సీగా ఎమ్మెల్యేగా ఎంపీగా మంత్రిగా ముఖ్యమంత్రిగా గవర్నర్ గా మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకుడుగా రోశయ్య సేవలు చిరస్మరణీయమని భావితరానికి వారు ఆదర్శ నాయకులని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కే బి శ్రీధర్ కొనియాడారు. కీర్తిశేషులు రోశయ్య 4 వ వర్ధంతి సందర్భంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ క్యాంప్ ఆఫీస్ లిబర్టీ ప్లాజా బషీర్బాగ్ హైదరాబాద్ నందు జరిగిన వర్ధంతి కార్యక్రమంలో కేబి శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీలు వాసుదేవరావు పుష్పాంజలి మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పద్మిని మరియు ఐపీసీ నాయకులు పాల్గొన్నారు.

# గద్వాల రాజవంశీయులు డాక్టర్ సుహాసిని రెడ్డి కన్నుమూత



హైదరాబాద్ డిసెంబర్ 4 గద్వాల కృష్ణారెడ్డి బంగ్లా కు చెందిన రాజవంశీయులు డాక్టర్ సుహాసిని రెడ్డి ( 85)ఈ తెల్లవారుజామున నిద్రలోనే పరమపదించిందని వారి కుమారుడు లక్ష్మీ చెన్నకేశవరెడ్డి తెలిపారు. డాక్టర్ సుహాసిని రెడ్డి మరణించడం పొట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గతం లో ఆమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ గా పనిచేసారు. అంత్యక్రియలు హైదరాబాదులో జరుగుతాయని తెలిపారు.

## దుండగులను కఠినంగా శిక్షించాలి

హ్వాళగుంద, మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో బుధవారం రాత్రి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి గురు తెలియని వ్యక్తులు పేడ వేసి అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని గురువారం ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు కేంచప్ప డిమాండ్ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్,తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీకి వినంతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్నికి పేడ వేసి అవమానించిన దుండగులు ఎవరైనా సరే సీసీ కెమెరాలో గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లికార్జున,బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిదానంద,దళిత సంఘం నాయకులు మల్లేష్,దుర్గా ప్రసాద్,వెంకటేష్,బసప్ప,నాగేంద్ర,మంగయ్య,భాస్కర్,దేవప్ప తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ మూర్తి అయ్యప్ప సేవ సమితి - భక్త మండలి' మహా పడిపూజ మహోత్సవం..



**కూకట్పల్లి (ప్రజాబలం) డిసెంబర్ 04:** స్వామి అయ్యప్ప.. శరణం అయ్యప్ప..అంటూ కరిమళవాసుడు అయ్యప్ప స్వామిని కొలుస్తూ బాలానగర్ పరధిలోని అంబికా కాలనీ లోఅయ్యప్ప మండల 36వ మహాపడి పూజా మహోత్సవం అల్లంశెట్టి లక్ష్మీనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు.

దక్షిణ మూర్తి అయ్యప్ప సేవ సమితి భక్త మండలి' సేవాసమాజం ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ పద్ధతిలో మహా పడిపూజ కన్నుల పండుగగా లక్ష్మీనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగింది. హర హర సుతన స్వామియే శరణం ఆయప్ప శరణం అంటూ అయ్యప్ప స్వామి శరణు గోషతో అంబికా కలని పురవీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 300 మందికిపైగా అయ్యప్ప భక్తులు హాజరై శబరిమల అయ్యప్ప స్వామిని ఘనంగా పరిపూర్ణానందంతో పూజించి దైవ ప్రసాదాలు అందుకున్నారు. భక్త మండలి అధ్వర్యంలో స్వాములకు, భక్తులకు అల్పాహార బిక్షను ఏర్పాటు చేశారు.

అనంతరం లక్ష్మీనారాయణ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి కృపా కటాక్షాల తో మీరు,మీ కుటుంబ సభ్యులందరూ కుడా ఆయురారోగ్యాలు తో పాటు సుఖ సంతోషాలతో, సిరి సంపదలు సిద్దించాలని అందరికీ దేవ దేవుడు అయినటువంటి పరమశివుడిని వెడుక్కొన్నట్లు తెలియజేశారు.

# ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా రోశయ్య సేవలు చిరస్మరణీయం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 04 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా పనిచేసిన కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాన భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా యువజన క్రీడ సేవల అధికారి హనుమంత్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఇతర అధికారులతో కలిసి హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా ఎన్నో సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసి రాష్ట్రాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేశారని తెలిపారు.అనంతరం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా పని చేసి విశిష్ట సేవలు అందించారని తెలిపారు.రాజకీయాలలో స్వచ్ఛమైన వ్యక్తిగా గుర్తింపు పొందారని, రోశయ్య వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహనీయుల ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ కలెక్టరేట్‌లో మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళులు

## నిబద్ధతకు నిదర్శనం రోశయ్య నాల్గవ వర్ధంతి సందర్భం గా అధికారుల నివాళులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం డిసెంబర్ 4:** ఆర్థిక విషయాలలో మంచి అవగాహన , నిబద్దత, క్రమశిక్షణతో, తక్కువగా మాట్లాడి ఎక్కువగా పని చేసే స్వభావం కలిగిన ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంతి కొణజెటి రోశయ్య 4వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాయువజన, క్రీడల శాఖ అధికారి దామోదర్ రెడ్డి, డిఆర్డిఓ సాంబశివరావు రోశయ్య గారి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి విజయ కుమారి, డిటిఓ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి 18వ మహా పడిపూజకు అయ్యప్ప స్వాములకు భక్తులందరికీ ఆహ్వానం






శ్రీ హరిహర సుతుడు అయ్యప్ప స్వామి వారి మాల ధారణ ధరించ అయ్యన్ శేఖర్ గురుస్వామి గారి 18వ పాడి పూజ నిర్వహిస్తున్న శబరిమల అయ్యప్ప స్వామి వారికీ నిత్య పూజ ధూప దీప నైవైద్యాలతో పూజపురస్కారాలు నిర్వహించిన దేవాలయ మాజీ ప్రధాన అర్చకులు యస్. అరుణ్ కుమార్ నంబూద్రి (మేల్ శాంతి) గారి సువస్తాలతో అంగరంగ వైభవంగా పూజ భవాని శివ శంకర దేవాలయం,(దేవుని తోట) బోలకపూర్ సికింద్రాబాద్ నిర్వహించడం జరుగుతుంది.

అలాగే ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులను అలాగే సంఘసంస్కర్తలైన గురుస్వాములను ముఖ్య అతిథులుగా పిలవడం జరుగుతుంది అందులో ఒకరు

డాక్టర్ కొత్వల్ దయానంద్ (24వ) గురుస్వామి గారు పలు సంఘాలలో స్వచ్ఛందంగా నిస్వార్ధమైన వారి యొక్క సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని కూడా ఈ పూజ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది.

ఈ18వ అయ్యప్ప స్వామి మహా పడిపూజకు అయ్యప్ప స్వాములు, అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ హరిహర సుతుడు అయ్యప్ప స్వామి వారి ఆశీర్వాద దీవెనలు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పూజ నిర్వాహకులైన అయ్యన్ శేఖర్ గురుస్వామి గారు మరియు కమిటీ సభ్యులు కృతజ్ఞతలతో మనవి చేశారు.

ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్ను స్వాములు
నవీన్ గురుస్వామి,
శివకుమార్ గురుస్వామి
త్రిశూల్ గురుస్వామి
సంతోష్ గురు స్వామి
సాయిబాబా కన్య స్వామి
అభిలాష్ గదస్వామి
నరేష్ కన్య స్వామి
కొత్వాల్ పవన్ కుమార్ గురు స్వామి మరియు వారి శిష్య బృందం పాల్గొంటున్నారు.

# నామినేషన్ ప్రక్రియ సమర్ధవంతంగా చేపట్టాలి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 04 :** రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో 3వ విడత నామినేషన్ ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని భీమారం మండలంలో భీమారం, పోలంపల్లి,ఆరేపల్లి గ్రామాలకు భీమారం గ్రామపంచాయతీ, బూర్గుపల్లి,నర్సింగాపూర్ (బి) గ్రామాలకు బూర్గుపల్లి గ్రామపంచాయతీ, దాంపూర్,ధర్మారం, కాజిపల్లి గ్రామాలకు కాజిపల్లి గ్రామపంచాయతీ లలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, సి.ఐ.నవీన్ లతో కలిసి సందర్శించి నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ... నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని,నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితాలో పూర్తి వివరాలతో రూపొందించాలని,ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని తెలిపారు.ఎన్నికల గుర్తుల కేటాయింపులు జాగ్రత్త వహించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సామాగ్రి జిల్లాలో అందుబాటులో ఉందని, అవసరం మేరకు వినియోగించుకోవాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు




ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా,పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ,ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు.విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించి ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించడంతో పాటు సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లిసాయిబాబా మందిరంలో మనసు ప్రశాంతత పురం వెంకటేష్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి/సాయిబాబా మందిరంలో మానసిక ప్రశాంతత మంచి వాతావరణం ప్రతి గురువారం దేవుని సన్నిధిలో గడపడం చాలా ఆనందంగా ఉందని పురం వెంకటేష్ తెలిపారు దేవుని సన్నిధిలో ఉన్న సంతోషం ప్రశాంతతమరి ఎక్కడ లేదని ప్రతి మనిషికి తల్లిదండ్రుల ఆశీర్వాదము ఎంత ముఖ్యమో అలాగే దేవుని ఆశీర్వాదం కూడా అంతే ప్రాముఖ్యమని తెలిపారు

# కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయం..సత్యం శ్రీరంగం.

## నిబద్ధత, సౌమ్యత, ప్రజాసేవలో చెరగని ముద్ర వేసిన అజాతశత్రువు రోశయ్య..



**కూకట్పల్లి (ప్రజాబలం) డిసెంబర్ 04:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన టీపీసీసీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షులు టి. కుమార్ రావు, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సాధారణ జీవనం, ఉన్నత ఆచరణతో రాష్ట్ర రాజకీయాలకు నాణ్యత తీసుకువచ్చిన రోశయ్య ఆర్థిక క్రమశిక్షణ, ప్రజాహిత నిర్ణయాలు, నైతిక పాలనకు ప్రతీక. ఆయన నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న ప్రేమ, పార్టీ పట్ల చూపిన అంకితభావం ఈ తరానికి కూడా మార్గదర్శకమే. ఆయనను స్మరించుకుంటూ, ప్రజాసేవ, బాధ్యతాయుత పాలన, నైతిక రాజకీయాలు అనే ఆయన చూపిన మార్గంలో కట్టుబడి ముందుకు సాగుతున్నాం అని అన్నారు.

# ట్రాఫిక్ చాలాన్లపై 100% డిస్కౌంట్




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 04 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** మీ వాహనంపై ట్రాఫిక్ చాలాన్లు పెండింగ్లో ఉన్నాయా, ఆ మొత్తాన్ని చెల్లించడానికి రాయితీ కోసం ఎదురు చూస్తున్నారా, అయితే ఇది మీకు నిజంగా శుభవార్త, డిసెంబర్ రెండో వారంలో సరిగ్గా డిసెంబర్ 13,న జరగబోయే దేశవ్యాప్తంగా లోక్ అదాలతో లో, మీ పాత ట్రాఫిక్ చాలాన్లను, 50% నుండి 100% వరకు, రాయితీతో (డిస్కౌంట్ తో) క్లియర్ చేసుకునే అద్భుత అవకాశం లభించింది, ఈ లోక్ అదాలత్ ద్వారా, చాలన్లను సెటిల్ చేసుకోవడం వలన, మీపై ఉన్న కేసు పూర్తిగా క్లోజ్ అవుతుంది, భవిష్యత్తులో మళ్లీ ఆ చాలాన్లకు సంబంధించి, కోర్టు విచారణ ఉండదు, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, %శ్రీ%పర్యవేక్షణలో ఈ లోక్ అదాలత్ లను,నిర్వహిస్తారు, చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘనలను,, ఈ ప్రత్యేక డ్రైవ్ లో, 11, రాష్ట్రాలతో పాటు, తెలంగాణలో కూడా భాగమవుతుంది, రాయితీకి అర్హత ఉన్న, ట్రాఫిక్ ఉల్లంఘనలు, చిన్నపాటి ఉల్లంఘనలు, ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న, పాత ఈ- చాలన్లను, ఈ లోక్ అదాలత్ లో సెటిల్ చేసుకోవచ్చు, వాటిలో ముఖ్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, రెడ్ సిగ్నల్ జంప్ చేయడం, సాధారణ ఓవర్ స్పీడింగ్ కేసులు, రాంగ్ పార్కింగ్ ఉల్లంఘనలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోవడం, వల్ల విధించిన చాలన్లు, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం
వల్ల విధించిన చాలాన్లు, నంబర్ ప్లేట్ లేకపోవడం, ఫిట్నెస్ సర్టిఫికెట్ లోపాలు, ఇతర పొరపాటుతో తప్పుగా నమోదైన చాలన్లు, అన్ని ఈ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చు, అధికారులు స్పష్టం చేసిన దాని ప్రకారం, ప్రాణాలకు ముప్పు కలిగించే, లేదా తీవ్రమైన నేరాలకు సంబంధించిన, కేసులకు, ఈ రాయితీ వర్తించదన్నారు, దీనిలో మద్యం సేవించి వాహనం నడపడం, (డ్రంక్ అండ్ డ్రైవ్) ఈట్ అండ్ రన్ కేసులు, ప్రమాదకర డ్రైవింగ్, గాయాలు లేదా మరణాలకు దారి తీసిన, రోడ్డు ప్రమాదాల వంటి కేసులు ఉన్నాయి...

# కొంషట్ పల్లి అన్ని వర్గాలు మమేకమై గెలుపు దిశగా మన్నె సుధాకర్.



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి,డిసెంబర్,4(ప్రజాబలం)వికారాబాద్ జిల్లా** :మర్పల్లి /మండల పరిధిలోని కొంషట్ పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో ప్రచారంలో పాల్గొన్న మన్నె సుధాకర్ తెలిపారు తాగునీరు, రోడ్లు పారిశుధ్యం వీధి దీపాలు డ్రైనేజీ సిసి రోడ్లుగ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో నా వంతు కృషి చేస్తానని సభముఖంగా గ్రామ ప్రజలకుతెలిపారు.ప్రజలు మమేకమై ప్రచార కార్యక్రమానికి ఉత్సాహం చూపుతున్నట్లు అన్ని వర్గాల వారు మమేకమై ఆయన ప్రచార కార్యక్రమానికి బ్రహ్మరథం పడుతున్నట్లు తెలిపారుగెలుపు దిశగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు నేను చేసిన సేవ కార్యక్రమాలు గ్రామ ప్రజలు గుర్తించి నాకు ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల అభివృద్ధి పరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలు నాయబ్ గౌడ్ విలేజ్ ప్రెసిడెంట్ వీరేశం గౌడ్ సర్పంచ్ అభ్యర్థి మనే సుధాకర్ గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు యువకులు మహిళా సోదరులు ప్రచార కార్యక్రమంలో భారీ ఎత్తున పాల్గొనాలని సర్పంచ్ అభ్యర్థిని భారీ మెజార్టీ గెలిపిస్తామనితెలిపారు.



## రూ.లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు

పత్తికొండ ప్రభుత్వం ప్రతి పంచాయతీలో రూ. లక్షలు వెచ్చించి సంపద సృష్టి కేంద్రాలను నిర్మించింది. గ్రామంలోని చెత్తాచెదారాన్ని ఆ కేంద్రాలకు తరలించాలి. తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా మార్చి విక్రయించగా.. వచ్చే ఆదాయాన్ని గ్రామాభి వృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది. కానీ పంచాయతీ అధికారుల పట్టించుకోవడం లేదు. దాంతో ఆ లక్ష్యం నీరుగారుతోంది మండగిరి ,అగ్రహారం గ్రామంలో 12 వందల జనాభా ఉన్నారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించాలి. ఎక్కడ పడితే అక్కడ పారబోయకుండా చెత్తతో సంపద సృష్టించాలనే ఊరి బయట కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.లక్ష్యం పూర్తిగా నీరుగారిపోయింది.ఏళ్ల తరబడి ముళ్లపొదల్లో ఎలాంటి అభివృద్ధి మూసుకుపో యింది. అధికారులు దానిని వినియోగంలోకి తెచ్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మండలంలోని గ్రామంలో లక్షలతో నిర్మించిన చెత్త సంపద కేంద్రం వినియోగంలో లేనందున పూర్తిగా శిథిలమైంది. అధికారులు దానికి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఈవో ఆర్ డి నరసింహులు వద్ద 'ఉదయం న్యూస్' ప్రస్తావించగా పరిశీలన జరిపి నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు దిశగా పరశురాం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి డిసెంబర్ 4 (ప్రజాబలం) వికారాబాద్:**/పట్లూర్ గ్రామంలో ఇంటింటా కాన్వాసింగ్లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కాంగ్రెస్ ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు పక్కనే పట్లూరు మాజీ ఎంపిటిసి స్వప్న సురేష్ తెలిపారు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కల ప్రజలు నెరవేరుస్తారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపరశురాం తెలిపారు అందరూ కలిసి ఒక్కసారిఅవకాశం కల్పించి భారీ మెజార్టీతో గెలిపించాలని సురేష్ తెలిపారు కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థి పరశురామును ప్రజలు భారీ మెజార్టీతోగెలిపిస్తారని మాజీ ఎంపిటిసిస్వప్న సురేష్ తెలిపారు ఈ కార్యక్రమంలో యువకులు నాయకులు పాల్గొనటం తెలిపారు

# ఎన్నికల నియమావళి సక్రమంగా పాటించండి

## ఎన్నికల సాధారణ పరిశీలకులు పి.మనోహర్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 04 :** రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడతలో హాజీపూర్, లక్షెట్టిపేట్, దండేపల్లి మరియు జన్నారం మండలాల్లో జరుగుతున్న ఎన్నికలలో సర్పంచ్ గా పోటీ చేస్తున్న అభ్యర్థులకు గురువారం లక్షెట్టిపెట్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల రాష్ట్ర స్థాయి ఎన్నికల పరిశీలకులు శ్రీ పి మనోహర్ మాట్లాడుతూ... అభ్యర్థులందరూ సామరస్య పూర్వకంగా ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాలని కోరారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయవద్దని కోరారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ మరియు అదనపు ఎన్నికల అధికారి శ్రీ పి. చంద్రయ్య గారు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామస్థాయి ఎన్నికలు చాలా కీలకమని కావున ఇట్టి ఎన్నికలలో అభ్యర్థులందరూ ఎలాంటి కులమత విద్వేషాలకు పోకుండా సామరస్య వాతావరణం లో ఎన్నికలు జరుపుకొని గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు.ఎన్నికల వ్యయ పరిశీలకులు ఈ.రాజేశ్వర్ మాట్లాడుతూ... సర్పంచ్ అభ్యర్థికి ఒక లక్ష యాభై వేల రూపాయలు, వార్డు అభ్యర్థికి 30 వేల రూపాయలు ఖర్చు చేయడానికి పరిమితి ఉంటుందని అభ్యర్థులందరూ దీని దృష్టిలో ఉంచుకొని నూతనంగా తెరిచిన బ్యాంక్ అకౌంట్ ద్వారా ఎన్నికల లావాదేవీలు జరిపి, ఎన్నికల ఖర్చులను మండల స్థాయిలో ఉన్న సహాయ వ్యయ పరిశీలకులకు అందజేయాలని కోరారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ నరేష్ కుమార్ మాట్లాడుతూ అభ్యర్థులందరూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు జరుపుకోవాలని, ఎక్కడ కూడా లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా పోలీస్ వారు సూచించి ఇచ్చిన సమయంలోనే సమావేశాలు,ర్యాలీలు నిర్వహించి పోలీస్ వారికి సహకరించాలని, పోలీస్ శాఖ సూచనలు గమనించాలని కోరారు. ఈ సందర్భంగా హాజీపూర్ తహశీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే మాట్లాడుతూ... అభ్యర్థులకు సంబంధించి సమావేశాలకు గాని, ర్యాలీలకు గాని, లౌడ్ స్పీకర్ల గాని వారు ఉపయోగించే ఒక వాహనానికి కానీ స్థానిక తహసీల్దార్ నుండి పర్మిషన్ లెటర్ తప్పనిసరిగా తీసుకోవాలని, ఈ పర్మిషన్ లకు స్థానిక ఎస్.హెచ్.ఓ.నుండి రికమాండ్ అయిన తరువాతానే తహశీల్దార్ పర్మిషన్ ఇస్తారని సూచించారు. ముఖ్యంగా 11 వ తేదీన ఎన్నికలు,ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలు గాని సమావేశాలకు గాని అనుమతి లేదని , ఇది గమనించి అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట్, దండేపల్లి, జన్నారం తహశీల్దార్లు ఏ.దిలీప్ కుమార్ రోహిత్ దేశ్పాండే,రాజ మనోహర్ రెడ్డి 4 మండలాల సబ్ ఇన్స్పెక్టర్లు స్వరూప్ రాజ్,గోపతి సురేష్, తహసీద్దీన్,అనూష, తిరుపతి,లక్షెట్టిపెట్ ఎంపీడీవో సరోజ, సహాయ వ్యయ పరిశీలకులు,మాస్టర్ ట్రైనర్లు సర్పంచ్ కొరకు పోటీ చేయు నాలుగు మండలాల్లోనే అభ్యర్థులు అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

# పట్లూర్ సర్పంచ్ అభ్యర్థి సునీల్ గులాబిగెలుపు పక్క






**వికారాబాద్ నియోజకవర్గం డిసెంబర్ 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి/పట్లూర్ బి ఆర్ఎస్ అభ్యర్థి బానోత్ సునీల్ గెలుపు పక్క అని మాజీ సర్పంచ్ దేవరదశి ఇందిరా అశోక్ మర్పల్లి మైనారిటీ సెల్ అధ్యక్షులు షఫీ తెలిపారు పదేళ్ల సుదీర్ఘ పాలనలో కుటుంబానికి పెద్దకొడుకులా కేసీఆర్ చేసిన సేవలు సంక్షేమ పథకాలు అభినందనీయమని మరపురాని సేవలని ప్రజా క్షేమం కొరకు యువత మేలుకొరకు కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రజల కోసం అహర్నిశలు ఆలోచించి కష్టపడి ప్రజల ముందుకు తెచ్చిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని తెలిపారు ప్రచార కార్యక్రమంలో పెద్ద మనుషులు అమ్మమ్మ లాంటి వయస్సున్న వాళ్లు నెలసరి కనీస అవసరాలకు మొదటి వారంలోనే నాకు పింఛన్ ఇచ్చేవారని ఆయన నూరేళ్లు చల్లగా ఉండాలని ప్రజలు దీవెన హారతులు పలికినట్టు తెలిపారు పట్లూర్ సర్పంచ్ అభ్యర్థి సునీల్ గెలుపు దిశగా అన్ని వర్గాల ప్రజలు గులాబీ జెండా విజయం వరిస్తుందని మాజీ సర్పంచ్ దేవరదశి ఇందిరా అశోక్ మర్పల్లి మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ గ్రామ ప్రజలు పెద్దలు యువకులు తెలిపారు

# పేకాట స్థావరంపై దాడి

గుంటూరు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్గనైజింగ్ పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ బృందం దాడులు చేసింది. బుధవారం అర్ధరాత్రి పలకలూరు రోడ్, రత్నగిరి కాలనీలో ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారని టాస్క్ ఫోర్స్ సిబ్బందికి సమాచారం అందింది. దాంతో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న 9 సెల్ ఫోన్లు, 1టూ వీలర్ స్వాధీనం చేసుకుని, రూ.54,140/-ల నగదు సీజ్ చేసి, తదుపరి విచారణ కొరకు పోలీస్ స్టేషన్ కు తరలించారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** తన పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్న యోగేష్‌యాదవ్ ఈ సందర్భంగా యోగేష్‌యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ పాల్గొన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన గోషామహల్ కాంగ్రెస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ టీ.సతీష్ మేడికొండ కూమార్ ,యోగేష్‌యాదవ్

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆదనపు కలెక్టర్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** గురువారం రోజున వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామం, మరియు బోయిన్పల్లి మండలం మానువాడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్కు రూపాయలు 2389, సాధారణ రకానికి రూపాయలు 2369 గా నిర్ణయించినదని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని తమ గ్రామాలకు సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి తాసిల్దార్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.


గౌరవనీయులు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారికి "జన్మదిన శుభాకాంక్షలు"





"మీశిష్యుడు తలారి ప్రకాశం"

అందోల్ నియోజకవర్గం సీనియర్ జర్నలిస్ట్( ప్రజాబలం ) దినపత్రిక


# తెలంగాణ ఉద్యమ కళాకారులను గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి.

## తెలంగాణ ఉద్యమ కళాకారుల రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి.


**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** గురువారం రోజున వేములవాడ పట్టణంలోని డాక్టర్ సి.నారాయణరెడ్డి కళామందిరం నందు తెలంగాణ ఉద్యమకారుల, కళాకారుల పోరం, కళాకారుల విభాగం రాష్ట్ర





కన్వీనర్ ఎల్ల పోశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను ఉద్యమ కళాకారులను గుర్తించడానికి డిసెంబర్ 9వ తేదీ లోపు తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం కొరకు ప్రకటన జారీ చేయాలని ఉద్యమకారుల, కళాకారుల పక్షాన ప్రజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. అలాగే 07/12/2025 ఆదివారం రోజున ఉదయం 10:00 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు హైదరాబాదులోని ఆల్వాల్ చౌరస్తా ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణం నందు ఒకరోజు శాంతియుత దీక్ష కార్యక్రమం జరుగును. తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు భారీ సంఖ్యలో పాల్గొని దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలపడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీకాంత్ చారి ఉద్యమ స్ఫూర్తి పాదయాత్రలో వివిధ జిల్లాల నుండి ఉద్యమకారులు, కళాకారులు హాజరై విజయవంతం చేసినందుకు వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలను ఉత్తర తెలంగాణ కోఆర్డినేటర్ బొడ్డు రాములు తెలియజేయడం జరిగింది.

# ఏడాదిలో దేశవ్యాప్తంగా సరికొత్త టోల్ వ్యవస్థ : నితిన్ గడ్కరీ



న్యూ డిల్లీ డిసెంబర్ 4 టోల్ వసూలు వ్యవస్థపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుత టోల్ వసూలు వ్యవస్థ ఏడాదిలోపు కనుమరుగవుతుందని వెల్లడించారు. దాని స్థానంలో సరికొత్త వ్యవస్థను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం లో నితిన్ గడ్కరీ ఈ విషయాన్ని వెల్లడించారు.'ప్రస్తుత టోల్ వసూళ్ల వ్యవస్థ ఏడాదిలోపు ముగుస్తుంది. దాని స్థానంలో ఎలక్ట్రానిక్ వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. ఇక టోల్ కోసం ఎవరూ మిమ్మల్ని ఆపలేరు. కొత్తదాంతో హైవేలో ప్రయాణించేవారికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. ఈ కొత్త వ్యవస్థను ఇప్పటికే 10 చోట్ల ప్రవేశపెట్టాం. ఏడాదిలోపు దేశవ్యాప్తంగా విస్తరిస్తాం' అని లోక్‌సభకు తెలిపారు. అంతేకాదు దేశవ్యాప్తంగా ప్రస్తుతం రూ.10 లక్షల కోట్ల విలువైన 4,500 హైవే ప్రాజెక్టులు కొనసాగుతున్నట్లు ఈ సందర్భంగా గడ్కరీ తెలిపారు.

## కారంచేడు హైవేపై యాక్సిడెంట్.. ఒకరు మృతి

పిడుగురాళ్ల వాడరేవు పిడుగురాళ్ల జాతీయ రహదారి కారంచేడు సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. తెలంగాణ నుంచి వాడరేవుకు వస్తున్న కారు టైరు పేలడంతో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిందని చెప్పారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com